ప్రేమతో మాట్లాడు
ఆలోచించి మాట్లాడు
అర్థం చేసుకొని మాట్లాడు
మంచి మాట్లాడు
తెలివిగా మాట్లాడు
నవ్వుతూ మాట్లాడు
మనస్సు విప్పి మాట్లాడు
పూర్తిగా విన్న తరువాత మాట్లాడు
మనస్సు నొప్పించకుండా మాట్లాడు
తక్కువ మాట్లాడు



TGTEL/25/A1132

మానవాళికి

# జనం వార్త

ప్రతి అక్షరం.. జనం కోసం..




'జనం వార్త'
మీ వ్యాపార, ఉద్యోగ, రాజకీయ, వివాహ, జన్మదిన తదితర ప్రకటనల కోసం సంప్రదించండి...
సెల్ : 8522 055 889



మేడ్చల్ | మంగళవారం | 23.06.2026 | సంపుటి : 1 | సంచిక : 343 | పేజీలు : 8 | వెల : 2/- | ఎడిటర్: దూసరి రవీందర్ గౌడ్




**నేటి చికెన్ ధరలు**

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 135 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 162 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 251 (కిలో) |
| స్కిన్ లెస్ | 284 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹88

## వర్షాకాలంలో ప్రజల భద్రతే ప్రాధాన్యం

**ఆర్ అండ్ బి అధికారులు క్షేత్ర స్థాయిలో పనిచేయాలి**

**వరదల సమయంలో తక్షణ స్పందన కోసం సిద్ధం**

**వరద ప్రాంతాల్లో అధికారులు పూర్తి అప్రమత్తత**

**రోడ్లు భవనాలు శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**



హైదరాబాద్, జూన్ 22 : రాష్ట్రంలో వర్షాకాలం సందర్భంగా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా రహదారి రవాణా వ్యవస్థను నిరంతరం కొనసాగించడంతో పాటు, వరదల వల్ల రహదారులు, వంతెనలు, కల్వర్టులు తదితర మౌలిక సదు–పాయాలకు

-మిగతా 2 లో..

## సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటన

**నాంపల్లి కోర్టుకు హాజరుకాని అల్లు అర్జున్**

**షూటింగ్‌ల కారణంగా రాలేకపోయారని వివరణ**

**విచారణ జూలై 6కు వాయిదా వేసిన కోర్టు**

హైదరాబాద్‌లో సంచలనం సృష్టించిన సంధ్యా థియేటర్ తొక్కిసలాట ఘటనకు సంబంధించిన కేసుపై నాంపల్లి కోర్టులో సోమవారం విచారణ జరిగింది. ఈ కేసులో నిందితులుగా పేర్కొన్న పలువురు కోర్టు ముందు హాజరుకాగా, సినీ నటుడు అల్లు అర్జున్ వ్యక్తిగత కారణాలతో హాజరు కాలేకపోయారని ఆయన తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు.



04

## ఆర్డీఎస్ నీటిపై రాజీలేదు

**రైతుల ప్రయోజనాలు కాపాడి తీరుతాం**

**నీటిపారుదల శాఖ అధికారులతో మంత్రి ఉత్తమ్ సమీక్ష**



హైదరాబాద్, జూన్ 22 : తెలంగాణ హక్కుల పరిరక్షణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. రాజోలిబండ డైవర్షన్ స్కీమ్‌లో తెలంగాణకు కేటాయించిన నీటి వాటాపై రాజీ ఉండదని తేల్చిచెప్పారు. ఆర్డీఎస్ ఆయకట్టు రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. సోమవారం సచివాలయంలో నీటిపారుదల శాఖ అధికారులతో మంత్రి ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. రాజోలిబండ డైవర్షన్ స్కీమ్, తుంగభద్ర డ్యామ్‌పై చర్చించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ.. తుంగభద్ర జలాల వినియోగంపై తెలంగాణ హక్కులను బలంగా వినిపించాలని అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. తుంగభద్ర నీటి పంపిణీ అంశాలపై ఈ సమావేశంలో సమగ్రంగా చర్చించారు. ఎగువ రాష్ట్రాల చర్యల వల్ల తెలంగాణ రైతులకు నష్టం జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. కృష్ణా

-మిగతా 2 లో..



## లక్నోలో భారీ అగ్నిప్రమాదం

**కోచింగ్ సెంటర్‌లో మంటలు..15మంది దుర్మరణం**

**తక్షణమే చర్యలకు దిగిన యూపి సిఎం యోగి**

**ఘటనపై ప్రధాని మోడీ తీవ్ర దిగ్భ్రాంతి**

ఉత్తర్‌ప్రదేశ్ రాజధాని లఖ్‌నవూలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అలీగంజ్ జిల్లా పూర్నియా ప్రాంతంలో ఉన్న ఓ కోచింగ్ సెంటర్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. ప్రమాదం జరిగిన సమయంలో కోచింగ్ సెంటర్‌లో పెద్ద సంఖ్యలో విద్యా ర్థులు ఉన్నట్లు సమాచారం. మంటలు వేగంగా వ్యాపిం చడంతో భవనం మొత్తం దట్టమైన పొగతో నిండిపో యింది. దీంతో లోపల ఉన్న విద్యార్థులు ఊపిరాడక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో దాదాపు 15 మంది మృతి చెందినట్లు సమాచారం.

లక్నో, జూన్ 22 : భవనంలో కోచింగ్ సెంటర్‌తో పాటు పలు దుకాణాలు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రమాద సమయంలో ఐదుగురు నుంచి ఏడుగురు విద్యార్థులు భవనం నుంచి దూకినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. వారిలో ఇద్దరికీ తీవ్ర గాయాలు కాగా, చికిత్స అందిస్తున్నారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనాస్థలికి

-మిగతా 2 లో..

# ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు పూర్తి సహకారం

**దేవరకద్ర డిఆర్ఎస్ ప్రాజెక్ట్ సత్వరం చేపట్టాలి**

**కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌తో సిఎం రేవంత్ భేటీ**

**రక్షణ భూములు కేటాయించినందుకు కృతజ్ఞతలు**



న్యూఢిల్లీ, జనం వార్త ప్రతినిధి: ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి రాష్ట్రం అన్ని విధాలా సహకారం అందిస్తుందని సిఎం రేంవత్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమి స్తోన్న ప్రాజెక్టుల్లో ఒకటైన ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ అభివృద్ధికి సంబంధించి తమ ప్రభుత్వం భూసేకరణ, యుటి లిటీస్ బదలాయింపు వంటి అంశాల్లో పూర్తి సహకారం అందిస్తామని కేంద్ర మంత్రికి రేవంత్‌రెడ్డి తెలిపారు. కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీలో సోమవారం సమావేశం అయ్యా రు. ఈ భేటీలో ఇరువురు నేతలు పలు కీలక అంశాలపై చర్చించారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు రక్షణ శాఖ భూము లు బదలాయించినందుకు రాజ్‌నాథ్ సింగ్‌కు.. సీఎం కృతజ్ఞతలు తెలిపారు. దేశ సమగ్రత, రక్షణకు సంబంధించిన అంశం కావడంతో రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్నివిధాలా సహాయ, సహకారాలు అందిస్తామని కేంద్రమంత్రికి స్పష్టం చేశారు సీఎం. ఆదిలాబాద్‌లో రానున్న భారతీయ

మిగతా 2 లో

## రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో రేవంత్, కిషన్‌రెడ్డి భేటీ

**మెట్రో రెండోదశ విస్తరణ తదితర ప్రాజెక్టులపై చర్చ**

న్యూఢిల్లీ, జూన్ 22 : తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటన కొనసాగుతోంది. పర్యటనలో భాగంగా రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సీఎం భేటీ అయ్యారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో కలిసి రైల్వేమంత్రితో రైల్ భవన్‌లో ఆయన సమావేశమయ్యారు. హైదరాబాద్

మిగతా 2 లో





## సింధుజలాలపై అవసరమైతే యుద్ధం

**భారత్‌తో తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధం**

**పాక్ రక్షణ మంత్రి ఖవాజా ప్రేలాపనలు**

04



04

## అమెరికాకు షాకిచ్చిన చైనా

**పలు రక్షణ కంపెనీలపై ఆంక్షలు**



## చిట్టినాయుడిని వదిలిపెట్టే ప్రసక్తి లేదు

**ఇబ్బంది పెట్టిన ప్రతీ ఒక్కరికీ సమాధానం ఇస్తా**

**వర్ధన్నపేట కార్యకర్తల భేటీలో కేటీఆర్ హెచ్చరిక**

02

## సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారంలో వేగం

**జిల్లాకో మండలంలో ఇంటిగ్రేటెడ్ భూభారతి అమలు**

**ఏడాది కాలంలో 3.65 లక్షల పాస్‌బుక్‌ల జారీ**

**రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

హైదరాబాద్, జనం వార్త ప్రతినిధి: రైతు భూమికి చట్టబద్ధమైన రక్షణ, స్పష్టమైన హక్కులు కల్పించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార/పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో భూసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తూ ముందుకు సాగుతోందన్నారు. సోమవారం రెవెన్యూ అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి మాట్లాడుతూ భూభారతి చట్టం అమల్లోకి వచ్చిన 2025 ఏప్రిల్ 14 నుంచి ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా

-మిగతా 2 లో..





## ఓట్, సీట్ చోరీలో బీజేపీ నిమగ్నం

**సర్ ప్రక్రియ ఓట్ల తొలగింపుకే ప్రాధాన్యం**

**ఎన్నికలు ఎప్పుడు జరిగినా కాంగ్రెస్‌కు వంద ఖాయం**

**టీపీసీసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్**

సర్ పేరిట దేశంలో ప్రజాస్వామ్యంపై దాడి జరుగుతోందని.. గతంలో ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ లేదని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. హనుమకొండలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ బూత్ లెవెల్ ఏజంట్ల శిక్షణా కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు పాల్గొని ప్రసంగించారు.

హనుమకొండ, జనం వార్త ప్రతినిధి: నాడు ఓటును జోడించే కార్యక్రమం జరిగి తే.. నేడు ఓటును తొలగించే కార్యక్ర మం జరుగుతోందని ఆరోపించారు. బెంగాల్‌లో ఓట్ చోరీ చేసి అడ్డదారిన బీజేపీ గెలిచిందని దుయ్యబట్టారు. ఓట్లేకాదని.. మీనాక్షి నటరాజన్ రాజ్యసభ సీటును కూడా దొంగి లించారని విమర్శించారు. ఇక దేశంలో ప్రజాస్వామ్యం,

-మిగతా 2 లో..

## భూమి గురించి అడిగితే పగబట్టారు

**రాయదుర్గం భూముల వేలంపై హరీష్ రావు ఫైర్**

మహబూబ్‌నగర్, జనం వార్త ప్రతినిధి: హైద రాబాద్‌లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండి యాకు అప్పటి ప్రభుత్వం ఎకరం భూమిచ్చిందని, అయితే...రేవంత్ రెడ్డి బ్యాంక్‌కు ఇచ్చిన భూమిని అమ్మేసిండని మాజీ మంత్రి, డిప్యూ టీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు మండి పడ్డారు. అంతేగాకుండా ఇప్పుడు ఎస్‌బిఐ మీద పగ పట్టిండని మండి పడ్డారు. అచ్చంపేట బీఆర్ఎస్ కార్య కర్తల సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ.. ఎస్‌బీఐకి ఇచ్చిన భూమిని వేలానికి ఇచ్చిండు.. భూమి ని అమ్మేసిండు. అమ్మేస్తే స్టేట్ బ్యాం క్ ఆఫ్ ఇండియా కోర్టుకు వెళ్లింది. మాకు ఎకరం భూమి ఇచ్చిరు. ఇది కూడా ఉచితంగా

-మిగతా 2 లో..



## ఓట్, సీట్ చోరీలో బీజేపీ నిమగ్నం

(మొదటిపేజీ తరువాయి)

రాజ్యాంగం ఎక్కడుందని ప్రశ్నించారు. ఓట్ల చోరీయే కాకుండా సీట్ల చోరీకి కూడా భాజపా పాల్పడుతోందని మహేశ్‌కుమార్ గౌడ్ విమర్శించారు. తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్‌ను కావాలనే తిరస్కరించారని ఆరోపించారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో ఎస్‌ఐఆర్‌పై నిర్వహించిన బూత్ లెవల్ ఏజెంట్ల శిక్షణ కార్యక్రమంలో మీనాక్షి నటరాజన్‌తో కలిసి మహేశ్‌కుమార్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో పదేళ్లపాటు దోపిడీ చేసి ఇప్పుడు కేటీఆర్ అసత్యాలు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ దోపిడీని ప్రజలు మరిచిపోయారనే భ్రమలో కేటీఆర్ ఉన్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి, సంక్షేమం జోడెద్దుల్లా ఉన్నాయన్నారు. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు ఎప్పుడు జరిగినా కాంగ్రెస్ పార్టీ వంద సీట్లు గెలవడం ఖాయమని మహేశ్ కుమార్‌గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా సొంత ఎజెండాతో ముందుకెళు న్నారని.. అందుకే వాస్తవాలు చెప్పేందుకు ఇక్కడికి వచ్చామని మహేశ్ తెలిపారు. కేటీఆర్ ఏ ముఖం పెట్టుకుని తిరుగుతున్నారని నిలదీశారు. పదేళ్లలో జరిగిన దోపిడీ, అవినీతి, అక్రమాలు మర్చిపోయారా అని ప్రశ్నించారు. ఆస్తుల కోసం చెల్లిని గెంటేసిన కేటీఆర్ ఇక ప్రజలకు ఏం న్యాయం చేస్తారన్నారు. మీనాక్షి నటరాజన్ రాజ్యసభ సీటు విషయంలో బీఆర్ఎస్ తీరు బీజేపీకి బలం చేకూర్చేలా ఉందని వ్యాఖ్యానించారు. పార్టీ కోసం కష్టపడిన వారిని గుర్తిస్తున్నామని.. కాస్త ఆలస్యం కావడంలో తమ తప్పిదం ఉందన్నారు. తప్పకుండా అందరికీ న్యాయం చేస్తామని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో 100 సీట్లు గెలుస్తామని మహేశ్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు.



## భూమి గురించి అడిగితే పగబట్టారు

(మొదటిపేజీ తరువాయి)

ఏం ఇయ్యలేదు. మేము దాదాపు రూ.20 కోట్లు పెట్టి ఈ భూమి కొనుక్కున్నమని.. ఈ భూమి మా పొజిషన్‌లో ఉన్నది. పైసల్ పెట్టి కొన్న మా భూమి రేవంత్ రెడ్డి ఎట్లా అమ్ముకున్నడు.. అని హైకోర్టుకు పోయారన్నారు.కోర్టు వాళ్లు పైసలు పెట్టి కొన్నది నిజమే కదా ఈ అమ్మకం తప్పు అని స్టే ఇచ్చింది. ఖతం రేవంత్ రెడ్డి ఎస్‌బీఐ మీద పగపట్టిండు. ఎస్‌బీఐని నిషేధిస్తాం. ఎస్‌బీఐలో ఉండే ఫిక్స్‌డ్ డిపాజిట్లు బయటకు తీసేస్తాం. ఎస్‌బీఐకి రాష్ట్ర ప్రభుత్వానికి ఉండే ఖాతాలన్నీ తీసేస్తా.. అని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను కూడా బ్లాక్ మెయిల్ చేస్తుండు.. రేవంత్ రెడ్డి తీరు ఎవరన్నా ప్రశ్నిస్తే పగబడ్తమన్నట్టు ఉంది. ఇవాళ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియానే నిషేధిస్తా అంటున్నడు.. రేపు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వరల్డ్ బ్యాంక్ కూడా నీ మాట వినలేదనుకో దాన్ని కూడా నిషేధిస్తా అంటాడు అని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రభుత్వ కార్యకలాపాలు నిర్వహించేందుకు ఒక ఒక బ్యాంక్ అయితే కావాలి కదా.. ఎవరు నీకు వ్యతిరేకంగా మాట్లాడితే ఆ బ్యాంక్‌నే నిషేధిస్తా అంటే మరి ఏం చేస్తడు.. నాకో డౌటు..కొత్తగా కొండల్ రెడ్డి బ్యాంక్ అని పెడ్తడో ఏమో.. పెట్టినా పెడ్తడు మస్త్ జమ అయినయ్ పైసలు. రేపు ఎనుముల కొండల్ రెడ్డి బ్యాంక్ అని పెట్టినా పెడ్తరన్నారు హరీశ్ రావు ఎద్దేవా చేశారు.



## వర్షాకాలంలో ప్రజల భద్రతే ప్రాధాన్యం

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్ర రోడ్లు భవనాలు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. ఇదివరకే తాను సమీక్షించిన అంశాల మేరకు ఆర్/బీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని స్థాయిల ఆర్ అండ్ బి అధికారులు పూర్తి అప్రమత్తతతో పనిచేయాలని మంత్రి సూచించారు. జూన్ నుంచి అక్టోబర్ వరకు వర్షాకాలం ముగిసే వరకు సూపరింటెండింగ్ ఇంజినీర్ నుంచి అసిస్టెంట్ ఇంజినీర్ వరకు అన్ని స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. త్యవసర పరిస్థితులను.. ఎదుర్కొనేందుకు జేసీబీలు, ఎక్స్కవేటర్లు, టిప్పర్లు, డీ-వాటరింగ్ పంపులు, ఇసుక సంచులు, కంకర, తారు, ఆర్‌సీసీ సామగ్రి, హెచ్‌డీపీఈ పైపులు తదితర అవసరమైన పరికరాలు, సామగ్రిని ముందుగానే సిద్ధంగా ఉంచాలని సూచించారు. రాష్ట్రంలోని వరద ప్రభావిత ప్రాంతాలు, ముంపు ప్రమాదం ఉన్న రహదారులు, వంతెనలు, కల్వర్టులు, కట్టల బలహీన ప్రాంతాలను ముందుగానే గుర్తించి నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని మంత్రి ఆదేశించారు. ప్రతి ప్రమాదకర ప్రాంతానికి ప్రత్యామ్నాయ మార్గాలను ముందుగానే గుర్తించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. భారత వాతావరణ శాఖ (ఐఎండీ), తెలంగాణ డిజాస్టర్ ప్రివెన్షన్ అండ్ సేఫ్టీ పోర్టల్, తెలంగాణ రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ జారీ చేసే హెచ్చరికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అధికారులు అప్రమత్తంగా ఉండాలని,పోలీస్,రెవెన్యూ, ఇరిగేషన్,విద్యుత్ శాఖలతో సమన్వయం చేసుకోవాలని మంత్రి పేర్కొన్నారు. భారీ వర్షాలు, వరదల కారణంగా రహదారులు దెబ్బతిన్న వెంటనే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రత్యామ్నాయ మార్గాలను అందుబాటులోకి తీసుకురావాలని, వరద నీరు తగ్గిన వెంటనే తాత్కాలిక పునరుద్ధరణ పనులు ప్రారంభించాలని ఆదేశించారు. నష్టం జరిగిన 24 గంటల్లోపు ఫోటోలు, జీపీఎస్ వివరాలతో నష్టం అంచనా నివేదికలు సిద్ధం చేసి సమర్పించాలని సూచించారు. ప్రజల ప్రాణ భద్రతకు సంబంధించిన అత్యవసర పనుల్లో ఎలాంటి ఆలస్యం జరగకుండా ఇంజినీర్లకు అప్పగించిన అధికారాల మేరకు తక్షణ చర్యలు తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. వరదల కారణంగా చేపట్టే పునరుద్ధరణ పనుల వ్యయాన్ని ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఎంఎఫ్ నిబంధనల ప్రకారం నిర్వహించాలని పేర్కొన్నారు. వర్షపాతం తీవ్రతను బట్టి రాష్ట్రవ్యాప్తంగా గ్రీన్,ఎల్లో,ఆరెంజ్, రెడ్ కలర్-కోడ్ ఆధారిత హెచ్చరిక వ్యవస్థను అమలు చేయనున్నట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. వర్షపాతం నమోదయ్యే ఆరెంజ్ అలర్ట్ సమయంలో ఇఇలు క్షేత్రస్థాయిలో నిరంతరం అందుబాటులో ఉండగా, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు ప్రత్యక్ష పర్యవేక్షణ చేపట్టాలని పేర్కొన్నారు. హైదరాబాద్ ఆర్ అండ్ బి ప్రధాన కార్యాలయంలో ఇప్పటికే ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ సెంటర్ కు ఈ వర్షాకాలంలో రోజువారీ పరిస్థితుల నివేదికలు తప్పనిసరిగా సమర్పించాలని, నష్టం జరగకపోయినా 'నిల్ రిపోర్ట్' ఇవ్వాలని ఆదేశించారు. ఫీల్డ్ సిబ్బందికి ప్రత్యేక అనుమతి లేకుండా సెలవులు మంజూరు చేయరాదని ఉన్నతాధికారులకు స్పష్టం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించడం ప్రధాన లక్ష్యమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు.

# ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు పూర్తి సహకారం

(మొదటిపేజీ తరువాయి)

వాయుసేన ఎయిర్‌పోర్ట్‌ను భారీగా విస్తరిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్నివిధాలా సహకరిస్తామని వివరించారు. భారత వాయుసేన టెర్మినల్‌తో పాటు ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించను న్న పౌర విమానయాన శాఖకు చెందిన టెర్మినల్ బిల్డింగ్‌తో పాటుగా కార్గో, ఎమ్ఆర్‌వో , హ్యాంగర్ సౌకర్యాలను పెద్దఎత్తున ఏర్పాటు చేసే లా సహకరించాలని ముఖ్యమంత్రి కోరారు. ఇటీవల పశ్చిమాసియా లో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ఎయిర్‌లైన్స్ తమ హ్యాంగర్స్‌ను ఏర్పాటు చేసుకోవడానికి అత్యంత అనుకూలమైన ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌ను ఆ దిశగా అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. తె లంగాణ రాష్ట్రంలోని మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర సమీపంలో డీఆర్డీవో/డీఆర్‌డీఎల్ ఎంచుకున్న ప్రదేశంలో వారికి సంబంధించిన కీలకమైన ప్రాజెక్ట్‌ను త్వరగా మంజూరు చేయాలని కేంద్రమంత్రికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. హస్తిన పర్యటనలో ఉ న్న సీఎం రేవంత్‌రెడ్డి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో భేటీ అయ్యారు. దాదాపు 20 నిమిషాల పాటు వివిధ అంశాలపై చర్చించారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు రక్షణభూములు బదలాయించినందుకు రేవంత్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. దేశ సమగ్రత, రక్షణకు సంబంధించిన అంశమైనందువల్ల ఆదిలాబాద్‌లో వాయుసేన విమానాశ్రయానికి సహకరిస్తామన్నారు.

## రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో రేవంత్, కిషన్‌రెడ్డి భేటీ



(మొదటిపేజీ తరువాయి)

మెట్రో రైలు ఫేజ్-2 అనుమతులపై వారు చర్చించారు. ఐఆర్ఎఫ్‌సీ రుణ నిధుల విడుదలపైనా నేతలు సమీక్షించినట్లు సమాచారం. ఇటీవల కిషన్‌రెడ్డికి రేవంత్‌రెడ్డి బహిరంగ లేఖ రాశారు. హైదరాబాద్ మెట్రో రైలుకు ఐఆర్ఎఫ్‌సీ రుణం త్వరగా వచ్చేలా చూడాలని కోరారు. రైల్వేమంత్రితో భేటీ ఏర్పాటు చేయించాలని కోరారు. ఈ క్రమంలో తాజా సమావేశానికి ప్రాధాన్యం ఏర్పడింది. హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్ట్ టేకోవర్, మెట్రో ఫేజ్ 2 విస్తరణ, ఐఆర్ఎఫ్‌సీ పెండింగ్ నిధులు గురించి ఈ సమావేశంలో చర్చించనున్నారు. హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టుపై సీఎం రేవంత్ రెడ్డి, కిషన్ రెడ్డి మధ్య డైలాగ్ వార్ జరుగుతోన్న వేళ ఈ భేటీకి ప్రాధ్యానత సంతరించుకుంది. హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టుకు సంబంధించి సీఎం రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మధ్య మాటల యుద్ధం నడుస్తోన్న విషయం తెలిసిందే. ఇరువురు ఒకరిపై ఒకరు విమర్శలు వర్షం కురిపించుకుంటున్నారు. కిషన్ రెడ్డి వల్లే హైదరాబాద్ మెట్రో ఫేజ్ 2 ప్రాజెక్ట్ ఆగిపోయిందని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించగా.. తన వల్ల తెలంగాణకు రావాల్సిన ఏ ప్రాజెక్ట్ ఆగిపోలేదని కిషన్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. అయితే, హైదరాబాద్ మెట్రో ప్రాజెక్ట్ ఫేజ్ 2 అనుమతులు, పెండింగ్ నిధులపై చర్చించేందుకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో మీటింగ్ అరేంజ్ చేయాలని కిషన్ రెడ్డిని సీఎం రేవంత్ కోరారు. సీఎం అభ్యర్థనపై సానుకూలంగా స్పందించిన కిషన్ రెడ్డి.. సోమవారం కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో మీటింగ్ సెట్ చేశారు. ఈ సమావేశంలో ఆయన కూడా పాల్గొన్నారు. ఉప్పు నిప్పులా ఉన్న ఇద్దరు నేతలు ఒకే గదిలో కూర్చొని చర్చించడం తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

## లక్నోలో భారీ అగ్నిప్రమాదం

(మొదటిపేజీ తరువాయి)

చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, పలువురు విద్యార్థులు భవనంలో చిక్కుకుపోయి ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అగ్నిప్రమాదంపై స్పందించిన ఉత్తరప్రదేశ్ ముఖ్య మంత్రి యోగి ఆదిత్యనాథ్ సహాయక చర్యలను వేగవంతం చేయాలని, గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందిం చాలని అధికారులను ఆదేశించారు. ఘటనకు గల కారణా లపై అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఘోర అగ్నిప్రమాద ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబా లకు ఆయన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అలాగే గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిం చారు. ఈ విషాద ఘటన నేపథ్యంలో ప్రధానమంత్రి జాతీయ ఉపశమన నిధి నుంచి మృతుల కుటుంబా లకు రూ.2 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందజే యనున్నట్లు ప్రకటించారు. ప్రమాదంలో గాయపడిన ప్రతి ఒక్కరికీ రూ.50 వేల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వనున్నట్లు వెల్లడించారు. అలీగంజ్ ప్రాంతంలోని ఓ కోచింగ్ సెంటర్‌లో జరిగిన ఈ అగ్నిప్రమాదం దేశవ్యాప్తంగా ఆందోళన కలిగించింది. ఈ ఘటనలో దాదాపు 14 మంది మృతి చెందినట్లు సమాచారం.




లఖ్‌నవూ కోచింగ్ సెంటర్ అగ్నిప్రమాద స్థలాన్ని ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సందర్శించారు. అగ్నిప్రమాద ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో కొంతమంది చిన్నారులు ప్రాణాలు కోల్పోవడం ఎంతో బాధాకరమన్నారు. మృతి చెందిన వారి కుటుంబాలకు సంతాపం ప్రకటించారు. అలాగే బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఘటనపై పూర్తి వివరాలు సేకరించి నివేదిక అందించాలని రాష్ట్ర పోలీసు డైరెక్టర్ జనరల్ (డీజీపీ), అదనపు ప్రధాన కార్యదర్శి (హోం)లకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

## సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారంలో వేగం

(మొదటిపేజీ తరువాయి)

3.65 లక్షల పాస్‌బుక్‌లు జారీ చేసినట్లు వెల్లడించారు. పాస్‌బుక్ కోసం రైతులు నెలల తరబడి రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేదని, ఇప్పుడు ఆ పరిస్థితులకు ముగింపు పలుకుతూ రైతు దరఖాస్తు చేసిన వెంటనే పాస్‌బుక్ అందే విధంగా వ్యవస్థను పారదర్శకంగా, వేగవంతంగా రూపొందిం చామని చెప్పారు. రైతు ఒక్కసారి దరఖాస్తు చేస్తే తిరిగి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా సేవలు అందేలా చూడాలని స్పష్టం చేశారు. భూభారతి చట్టంలో పేర్కొన్న విధంగా వ్యవసాయ భూముల క్రయవిక్రయాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా రిజిస్ట్రేషన్ సమయంలో సర్వే మ్యాప్ జత చేసే నిబంధనను ప్రస్తుతం ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్న ఐదు మండలాల్లో పరిస్థితులను మంత్రిగారు సమీక్షించారు. ఈ విధానం విజయవంతంగా కొనసాగు తోందని అధికారులు వివరించగా, అక్కడి అనుభవాలు, సమస్యలను పరిగణనలోకి తీసుకుని త్వరలోనే రెండో దశలో ప్రతి జిల్లాకు ఒక మండలంలో అమలు చేసేలా కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారంలో మరింత వేగం పెంచా లని మంత్రి గారు ఆదేశించారు. మొత్తం 9.25 లక్షల సాదాబైనామా దరఖాస్తులలో, ఇప్పటివరకు ఆరు లక్షల దరఖాస్తుదారులకు నోటీసులు జారీ చేసినట్లు అధికారులు తెలియజేశారు. మిగిలిన దరఖాస్తులకు వచ్చే 15 రోజుల్లో నోటీసులు జారీ పూర్తి చేయాలని, ఆ తర్వాత 30 రోజుల గడువు ముగిసిన వెంటనే అర్హులైన దరఖాస్తులను పరిష్కారించే విధంగా ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. త ప్రభుత్వం సాదాబైనామా అంశాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. దరఖాస్తులు స్వీకరించినప్పటికీ వాటి పరిష్కారానికి 2020 ఆర్వోఆర్ చట్టంలో సరైన నిబంధనలు లేకపోవడం వల్ల వేలాది మంది రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. కానీ గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు తమ ప్రభుత్వం నిబంధనలను సవరించి దరఖాస్తుదారులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టిందని తెలిపారు.

## చిట్టినాయుడిని వదిలిపెట్టే ప్రసక్తి లేదు

### ఇబ్బంది పెట్టిన ప్రతీ ఒక్కరికీ సమాధానం ఇస్తా

### వర్ధన్నపేట కార్యకర్తల భేటీలో కేటీఆర్ ఘాటు హెచ్చరిక

**వరంగల్, జూన్ 22 :** వచ్చే ఐదేళ్లు ఎవ్వరినీ మరచిపోమని, సిఎం చిట్టి నాయుడును అస్సలు వదిలిపెట్టమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. వర్ధన్నపేట నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్‌తోపాటు నియోజకవర్గానికి చెందిన నేతలు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. వచ్చే ఐదేళ్లు ఏదీ మర్చిపోము. మనల్ని ఇబ్బంది పెట్టినోడిని మర్చిపోం.. మనమీద కేసులు పెట్టినోడిని మరిచిపోం. మనతో నిలబడినోళ్లను కూడా మరిచిపోమన్నారు. తప్పకుండా చెప్తున్నా.. నేను కేసీఆర్ సారంతా మంచోన్నైతే కాదు. వచ్చే ఐదేళ్లు చిట్టినాయుడుకు ఆయన బృందానికి సినిమా చూపెట్టే బాధ్యత నాది.. పక్కా విడిచిపెట్ట. రిటైరైనా పారిపోయినా సప్తసముద్రాల అవతల



దాక్కున్నా.. ఎవడెవడైతే మా కార్యకర్తలను సతాయించిండో ఒక్కొక్కడిని వెతికి తెచ్చి మీ ముందట నిలబెట్టే బాధ్యత నాది.. వదిలిపెట్టే సమస్యే లేదన్నారు. ఇది నేనేం ఊరికే చెప్పడం లేదు.. గుర్తు పెట్టుకోండి. కానీ రమేశన్న (ఆరూరి రమేశ్) వీడు మంచోడేనే అన్నా అని మళ్లా వారిని తీసుకొని రావొద్దని కేటీఆర్ సూచించారు.

## ఆర్డీఎస్ నీటిపై రాజీలేదు

(మొదటిపేజీ తరువాయి)

పరీవాహక ప్రాంత రైతుల సాగు అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. ట్రిబ్యునల్, బోర్డులు, అంతర్రాష్ట్ర సమావేశాల్లో తెలంగాణ వాదనను బలంగా వినిపిస్తామని చెప్పారు. చట్టపరమైన, సాంకేతిక, పరిపాలనా అంశాలపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తెలంగాణ వాటా నీటిని పూర్తిస్థాయిలో వినియోగించుకునే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తేల్చిచెప్పారు. రైతుల సాగునీటి అవసరాల పరిరక్షణలో ఎలాంటి రాజీ ఉండదన్నారు. రాష్ట్ర ప్రయోజనాలకు భంగం కలిగించే ఏ నిర్ణయాన్ని అయినా తెలంగాణ ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తుందని తెలిపారు. తెలంగాణ రైతుల హక్కులు, సాగునీటి భద్రత కోసం ప్రభుత్వం అన్ని వేదికలపై పోరాడుతుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.



## ప్రత్యామ్నాయ పంటల విత్తనాలపై ప్రత్యేక దృష్టి

- 2,601 రైతు వేదికల్లో జూన్ 23 నుండి 30 వరకు నిర్వహణ
- ఒకే వేదికపై రైతులకు నాణ్యమైన విత్తనాలు
- రైతులకు అందుబాటులో అన్నిరకాల విత్తనాలు
- అందుబాటులో నానో యూరియా, నానో డీఏపీ
- ఎల్‌నినో పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపికపై అవగాహన

**హైదరాబాద్, జూన్ 22 :** ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వర్షాభావ పరిస్థితులను తట్టుకునే ఆరుతడి పంటల సాగును ప్రోత్సహించే లక్ష్యంతో పప్పు జాతి పంటలను, నూనె గింజ పంటలను, చిరుధాన్యాలు. కూరగాయ పంటల సాగును రైతులను ప్రోత్సహించే దిశగా రైతులకు ఆయా పంటలకు సరైన విత్తనాలను, నాణ్యమైన విత్తనాలను ఒకే వేదికపై అందుబాటులో ఉంచుటకు ప్రభుత్వం ఈకార్యక్రమాన్ని రూపొందించారు. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 2601 రైతు వేదికలలో ఈనెల 23వ తేదీ నుండి 30 తేదీ వరకు విత్తన మేళాలు నిర్వహించనుంది. ల్గ÷తులు తమ అవసరాలకు అనుగుణంగా వివిధ పంటల ధ్రువీకరించిన విత్తనాలను సరసమైన ధరలకు కొనుగోలు చేసుకునేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. రైతులకు నాణ్యమైన విత్తనాలే అందేలా వ్యవసాయ శాఖ విస్తృత ఏర్పాట్లు చేసింది. విత్తన మేళాల్లో పెసర, మినుము, కంది వంటి పప్పుధాన్య పంటల విత్తనాలతో పాటు నువ్వులు, వేరుశెనగ వంటి నూనె గింజల పంటల విత్తనాలు, వివిధ రకాల చిరుధాన్యాలు, కూరగాయల విత్తనాలు అందుబాటులో ఉంటాయి. అలాగే సమగ్ర పోషక యాజమాన్యంలో కీలక పాత్ర పోషిస్తున్న నానో యూరియా, నానో డీఏపీ వంటి ఆధునిక ఎరువులను కూడా రైతుల కొనుగోలుకు అందుబాటులో ఉంచుతున్నారు. ల్గ÷తుల అభిరుచులు, మార్కెట్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని హెచ్ఎంటీ సోనా వంటి సన్న రకాల విత్తనాలను కూడా అందుబాటులో ఉంచుతున్నారు. ÷ుత్తన మేళాల సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులు, ఉద్యానవన శాఖ, శాస్త్రవేత్తలు రైతులకు విత్తనాల ఎంపిక, విత్తన శుద్ధి, సమగ్ర పంట యాజమాన్యం, ఎరువుల వినియోగం, నీటి యాజమాన్యం, చీడపీడల నివారణ తదితర అంశాలపై అవగాహన కల్పించనున్నారు. అంతేకాకుండా ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉ ంచుకొని తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలు, వాతావరణ పరిస్థితులకు అనుగుణమైన పంటల ఎంపికపై కూడా రైతులకు మార్గదర్శకాలు అందించనున్నారు. విత్తన మేళాలను రైతులు సద్వినియోగం చేసుకొని నాణ్యమైన ధ్రువీకరించిన విత్తనాలను కొనుగోలు చేసి శాస్త్రీయ సాగు పద్ధతులను అనుసరించడం ద్వారా అధిక దిగుబడులు సాధించాలని వ్యవసాయ సంచాలకులు డాక్టర్ బి. గోపి, ఐఏఎస్ కోరారు.

# డబ్బులు లేక ఏ ఒక్కరూ చికిత్సకు దూరం కావద్దు

## రజతోత్సవ వేడుకల్లో బసవతారకం ఛైర్మన్ బాలకృష్ణ




**హైదరాబాద్,జూన్22 :** పేదలకు అండగా ఉండాలనే లక్ష్యంతో బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ ప్రారంభమైందని ఆసుపత్రి ఛైర్మన్, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. రోజుకి 35 నుంచి 40 శస్త్రచికిత్సలు చేస్తున్నామని.. వేలాది మందికి ఇది ఓ ఆశాకిరణమని చెప్పారు. బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి రజతోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏపీ సీఎం చంద్రబాబు, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, కేంద్రమంత్రులు అనుప్రియ పటేల్, పెమ్మసాని చంద్రశేఖర్, తెలంగాణ మంత్రి దామోదర రాజనర్సింహ, ఏపీ మంత్రి సత్యకుమార్‌తో పాటు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, ఎన్టీఆర్ కుటుంబసభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడారు. నటుడిగా, ఎమ్మెల్యేగా కాదు.. ఓ కొడుకుగా మీ ముందు నిలుచున్నా. మా అమ్మ బసవతారకం క్యాన్సర్ బారిన పడినప్పుడు ఎంతో బాధపడ్డాం. డబ్బు ఉంది కాబట్టి గట్టిగా పోరాడగలిగాం. డబ్బు లేని వారు ఈ వ్యాధితో ఎలా పోరాడుతారని మా అమ్మ ప్రశ్నించారు. అప్పుడే ఈ ట్రస్ట్ ఏర్పాటు ఆలోచన వచ్చింది. 3.75 లక్షల మందికి ఓపీ సేవలు అందించాం. బాధతో ఆసుపత్రికి వచ్చే వారు నవ్వుతూ తిరిగి వెళ్లాలి అనేదే మా ఉద్దేశం. భారత్‌లోనే మొట్టమొదటి బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ కేంద్రం అప్పట్లో ప్రారంభించాం. ప్రభుత్వాలు మాకు ఎంతగానో సహకరించాయి. ఎన్నో సంస్థలు, ఎందరో దాతలు ఈ ప్రయాణంలో మాకు అండగా నిలిచారు. ఏ ఒక్క రోగి కూడా డబ్బు లేక క్యాన్సర్ చికిత్సకు దూరం కాకూడదు. 25 ఏళ్ల క్రితం చేసిన ప్రమాణాన్ని నిలబెట్టుకున్నాం.. భవిష్యత్తులోనూ కొనసాగిస్తాం. అమరావతిలో క్యాన్సర్ ఆసుపత్రి నిర్మిస్తాం. హైదరాబాద్‌లో సేవలు మరింత విస్తరిస్తాం అని బాలకృష్ణ అన్నారు. హైదరాబాద్ నోవాటెల్ హోటల్‌లో బసవతారకం ఇండో–అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి రజతోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆస్పత్రి ఛైర్మన్ నందమూరి బాలకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరయ్యారు. దగ్గుబాటి వెంకటేశ్వరరావు– పురందేశ్వరి దంపతులు, కాంగ్రెస్ సీనియర్ నేత కేవీపీ, సినీనటి గౌతమి తదితరులు పాల్గొన్నారు. రజతోత్సవ వేడుకల సందర్భంగా ఆస్పత్రి ప్రస్థానం, వైద్య సేవలు, భవిష్యత్ విస్తరణ ప్రణాళికలపై చర్చించారు. క్యాన్సర్ చికిత్స రంగంలో ఆస్పత్రి అందిస్తున్న సేవలు ఆదర్శంగా నిలుస్తున్నాయని అతిథులు అభినందించారు.

# సర్ ప్రక్రియపై జర్నలిస్టుకు అవగాహన



## ప్రెస్ అకాడమీ ఆధ్వర్యంలో సదస్సు

**హైదరాబాద్,జూన్ 22 :** ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ పక్రియపై జర్నలిస్టులకు అవగాహన కల్పించేందుకు తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి సహకారంతో తెలంగాణ మీడియా అకాడమి ఆధ్వర్యంలో సోమవారం నాంపల్లిలోని మీడియా అకాడమి ఆడిటోరియంలో అవగాహన సదస్సు నిర్వహించింది. కార్యక్రమానికి తెలంగాణ మీడియా అకాడమి చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్య ఎన్నికల అధికారి కార్యాలయం తరపున స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ బి. చెన్నయ్య మరియు డి. చిరంజీవి, ఐటీ మేనేజర్ పాల్గొని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎస్.ఐ.ఆర్ పక్రియపై సమగ్ర వివరణ అందించారు. ఈ సందర్భంగా వారు ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ కార్యక్రమం ఉద్దేశ్యం, అర్హులైన ఓటర్ల నమోదు, వివరాల సవరణ, మార్పులు, తొలగింపులు, ఇంటింటి సర్వే తదితర అంశాలపై విపులంగా వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న జర్నలిస్టులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు ఇస్తూ ఎస్.ఐ.ఆర్‌కు సంబంధించిన సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ మీడియా అకాడమి చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటరు జాబితాల ప్రాధాన్యత ఎంతో కీలకమైందని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం చేపడుతున్న కార్యక్రమాలపై ప్రజలకు సరైన సమాచారం చేరవేయడంలో మీడియా కీలక పాత్ర పోషించాలని ఆయన అన్నారు. జర్నలిస్టులు ఎస్.ఐ.ఆర్ పక్రియపై సమగ్ర అవగాహన పెంపొందించుకుని ప్రజలకు వాస్తవ సమాచారాన్ని అందించాలని సూచించారు. వివిధ ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా సంస్థలకు చెందిన జర్నలిస్టులు అధిక సంఖ్యలో పాల్గొని అవగాహన సదస్సును సద్వినియోగం చేసుకున్నారు. ఈ కార్యక్రమం జర్నలిస్టులకు ఎంతో ఉపయోగకరంగా, సమాచారపూర్వకంగా సాగింది. కార్యక్రమంలో నాగులపల్లి వెంకటేశ్వరరావు, మీడియా సంస్థలకు చెందిన జర్నలిస్టులు పాల్గొన్నారు.



# భువనగిరి కోటకు పూర్వ వైభవం

- టూరిజం సర్క్యూట్ ఏర్పాటు చేస్తాం
- రోప్‌వే నిర్మించే అంశాన్ని పరిశీలించిన మంత్రి జూపల్లి

**యాదాద్రి భువనగిరి, జూన్ 22 :** చరిత్ర కలిగిన పురాతన భువనగిరి ఖిల్లాకు పూర్వవైభవం తీసుకొస్తామని టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. దీనికి పర్యాటక శోభ కల్పిస్తామని అన్నారు. సోమవారం ఉదయం భువనగిరి ఖిల్లా పైకి రోప్ వే నిర్మించే స్థలాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఫోర్ట్ రిస్టోరేషన్ చేసి చరిత్ర తెలిపేలా మ్యూజియం ఏర్పాటు చేస్తామన్నారు. గంటకు మూడు వందల మంది ప్రయాణికులు ఖిల్లా పైకి వెళ్లేలా రోప్ వే ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. యాదగిరిగుట్ట , భువనగిరి ఖిల్లా, కొలనుపాక సోమేశ్వర ఆలయం, స్వర్ణగిరి కలుపుతూ టూరిజం సర్క్యూట్ ఏర్పాటు చేస్తామని మంత్రి వెల్లడించారు. గత ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన టూరిజం శాఖను దేశంలో నంబర్ వన్‌గా గుర్తింపు తీసుకొస్తామని స్పష్టం చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో చారిత్రక కట్టడాలు ఉన్నాయన్నారు. వాటిని ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో అభివృద్ధి చేసి వందలాది మందికి ఉపాధి కల్పిస్తామని చెప్పారు. నెలకు రెండు రోజులైనా టూరిజంకు సమయం కేటాయించాలని తెలంగాణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పర్యాటక స్థలాలకు వెళ్తే ప్రజల ఆలోచనా విధానం మారుతుందని... అనేక మందికి ఉపాధి లభిస్తుందని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు.

# భూపాలపల్లి జిల్లాలో దుర్ఘటన

## వాహనాలు తనిఖీ చేస్తుండగా దూసుకొచ్చిన లారీ డిటివో వెంకన్న మృతి

**జయశంకర్ భూపాలపల్లి, జూన్ 22 :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా, గణపురం మండలం చెల్పూరు శివారులో సోమవారం విషాదకర ఘటన చోటు చేసుకుంది. రవాణా శాఖ కార్యాలయం ఎదుట జిల్లా రవాణా అధికారి డీటీఓ వెంకన్న వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా, బొగ్గు లోడుతో వెళ్తున్న ఓ లారీ అదుపుతప్పి ఆయనపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో వెంకన్నకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వెంకన్న మృతి పట్ల మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. వారి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

# బట్టలు ఆరేస్తుండా విద్యుత్ షాక్

## భార్యాభర్తలు మృతి

**నిజామాబాద్,జూన్22 :** నిజామాబాద్ జిల్లాలో తీవ్ర విషాదం నెలకొంది. బట్టలు ఆరేస్తుండగా విద్యుత్ తీగలు తగడంలో భార్యాభర్తలు ఇద్దరు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ముగ్గురు పిల్లలు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. బోధన్ మండలం ఉట్‌పల్లి గ్రామానికి చెందిన దంపతులు రత్నావత్ సంజీవ్(45), జ్యోతి (41) బట్టలు ఉతికి ఆరేస్తుండగా బట్టలు ఆరవేసే తీగకు కరెంట్ వైర్లు తగిలి విద్యుత్ సరఫరా జరిగింది. దీంతో విద్యుదాఘాతానికి గురై వారిద్దరూ అక్కడే దుర్మరణం చెందారు. వారి ముగ్గురు పిల్లలు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ ప్రమాదంపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. భార్యాభర్తల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# బోధన్ మున్సిపాలిటీలో కౌన్సిలర్ల నిరసన

## మూడు నెలలయినా సమావేశం పెట్టనందుకు ఆవేదన

**నిజామాబాద్,జూన్22 :** బోధన్ పట్టణంలోని మున్సిపల్ పాలకవర్గం ఏర్పాటై ముడు నెలలు గడుస్తున్నా సమావేశం నిర్వహించడం లేదని బోధన్ మున్సిపాలిటీలో మున్సిపల్ కౌన్సిలర్లు సోమవారం వినూత్న నిరసన చేపట్టారు. మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మున్సిపల్ వైస్ చైర్మన్ మీర్ ఇలియాజ్ అలీ ఆధ్వర్యంలో ఎంఐఎం కౌన్సిలర్లు కార్యాలయం ఆవంఇలో టెంట్ వేసి కుర్చీలలో కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ మాట్లాడుతూ మున్సిపల్ పాలక వర్గం ఏర్పాటై మూడునెలలు పూర్తయినా నెలవారీ సమావేశాలు నిర్వహించడం లేదని మండిపడ్డారు. అంతేకాకుండా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తే వారు కూడా స్పందించడం లేదని ఆరోపించారు. ఈ విషయంలో మున్సిపల్ కమిషనర్‌కు పలుమార్లు విన్నవించామని ఆయన స్పందించకపోవడంతో సమస్యలు ఎవరికి చెప్పాలో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ లో సమావేశలు నిర్వహించని కారణంగానా తామే కార్యాలయం ఆవరణలో టెంట్, కుర్చీలు వేసి అధికారులను ఆహ్వానించామన్నారు. అధికారులు ఇక్కడకు కూడా రాక పోవడంతో తమ సమస్యలతో కూడిన వినతిపత్రం ఖాళీ కుర్చీకి అందచేసి నిరసన వ్యక్తం చేశారు. అధికారుల వైఫల్యం కారణంగా సమస్యల పరిష్కారంలో వార్డుల్లో ప్రజలకు ఏం చెప్పాలో తెలియక వార్డుల్లో తిరగడం కూడా మానివేశామని కౌన్సిలర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మున్సిపల్ సమావేశాలు నిర్వహించాలని, లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని మున్సిపల్ వైస్ చైర్మన్, కౌన్సిలర్లు హెచ్చరించారు.

# తెలంగాణ అభివృద్ధికి బిఆర్ఎస్ మోకాలడ్డు

- పదేళ్లలోఎ భ్రష్టు పట్టించిన నేతలే చిల్లర రాజకీయాలు
- కేటీఆర్, హరీశ్‌రావుల తీరుపై ఎంపి ఆగ్రహం
- సిఎం విజన్‌తో రాష్ట్రాభివృద్ధి చేస్తున్నారని చామల కితాబు



**యాదాద్రి భువనగిరి, జూన్ 22 :** తెలంగాణ అభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డి ఓ విజన్‌తో ముందుకెళ్తుంటే మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు జీర్ణించుకోలేకపోతున్నారని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ ఫ్రూట్ మార్కెట్, ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌తో విద్య, వైద్యం, రైతులకు మేలు చేయాలనే ఆలోచనతో సీఎం రేవంత్‌రెడ్డి ముందుకు పోతున్నారని వ్యాఖ్యానించారు. సీఎం రేవంత్‌రెడ్డిపై బావ, బామ్మర్దులు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. సోమవారం భువనగిరిలో ఎంపీ చామల పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. కేటీఆర్ పదేళ్లు అధికారంలో ఉండి సినిమా వాళ్లతో అంటకాగి సినిమా మాటలు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. రాజకీయంలో సినిమా మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. ప్రజల జీవితాలు కేటీఆర్‌కు సినిమాలాగా కనపడుతున్నాయా.. అని కిరణ్ కుమార్ రెడ్డి ఆగ్రహించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలన సూపర్ హిట్ అనుకుంటున్నారా…అని ప్రశ్నించారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో మిగులు రాష్ట్రం అప్పుల రాష్ట్రంగా మారిందని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలన షోలే సినిమా కాదని వ్యంగ్యంగా అన్నారు. రేవంత్‌రెడ్డి రెండున్నరేళ్ల పాలన గురించి కేటీఆర్ మాట్లాడటం విడ్డూరంగా ఉందని సెటైర్లు గుప్పించారు. బీఆర్ఎస్ పాలనలో ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యం అయ్యాయని ఆరోపించారు. రాష్ట్రంలో విద్యావ్యవస్థను గాడిలో పెట్టే ప్రయత్నం సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో రైతులకు వాస్తవ పరిస్థితులను వివరించి క్రాప్ డైవర్షన్‌పై అవగాహన కల్పిస్తున్నారని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో పండించిన ధాన్యం అత్యధిక దిగుబడి వస్తే కేంద్రప్రభుత్వం ఎందుకు కొనట్లేదని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని.. సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారని తెలిపారు. మెట్రోఫేజ్– 2 కోసం సంప్రదింపులు చేసి ఎల్ అండ్‌టీకి ఎగ్జిట్ ఇచ్చారని.. మెట్రోఫేజ్ –2ను పూర్తి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని కిరణ్ కుమార్ రెడ్డి వివరించారు. మెట్రోఫేజ్–2పై బీఆర్ఎస్ రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. మెట్రోఫేజ్ –2పై కిషన్ రెడ్డికి సీఎం రేవంత్‌రెడ్డి లేఖ రాశారని ప్రస్తావించారు. కేంద్రమంత్రుల అపాయింట్‌మెంట్ ఇప్పించాలని.. కలిసి అభివృద్ధిలో ముందుకెళ్దామని సీఎం అంటున్నారని అన్నారు. కేటీఆర్ బాధ్యతతో ప్రజల కోణంలో మాట్లాడాలని హితవు పలికారు. హైడ్రా పేరుతో ప్రజలను రెచ్చగొడుతున్నారని మండిపడ్డారు. హైడ్రా హైదరాబాద్ నగర అభివృద్ధిలో కీలకంగా మారిందని తెలిపారు. నాళాలు కబ్జాలు చేసి నిర్మాణాలు చేపట్టాలని హైడ్రా భావిస్తోందా…? అని ప్రశ్నించారు. హైదరాబాద్ నగరం ముంపునకు గురికాకుండా హైడ్రా కీలక పాత్ర పోషిస్తోందని వివరించారు. కేటీఆర్, హరీశ్‌రావు తమ ప్రభుత్వంపై చిత్తశుద్ధి లేని మాటలు మాట్లాడుతున్నారని కిరణ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# బ్రిటన్‌లో మరోసారి రాజకీయ అస్థిరత

## దేశ ప్రధాని కీర్ స్టార్మర్ పదవికి రాజీనామా

**లండన్,జూన్22 :** బ్రిటన్‌లో మరోసారి రాజకీయ అస్థిరత నెలకొంది. ఆ దేశ ప్రధాని కీర్ స్టార్మర్ తన పదవికి రాజీనామా చేశారు. లేబర్ పార్టీ ఒత్తిడి వల్లే ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని పేర్కొన్నారు. పదవిలో ఉన్నంత కాలం విలువలకు కట్టుబడి పని చేసినట్లు తెలిపారు. తాజా పరిణామంతో బ్రిటన్‌లో దశాబ్ద కాలంలో తమ పదవులకు రాజీనామా చేసిన ప్రధానుల సంఖ్య ఆరుకి చేరింది. కీర్ స్టార్మర్ 2024లో బ్రిటన్ ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. స్థానిక ఎన్నికల్లో లేబర్ పార్టీ పేలవమైన ప్రదర్శన మాత్రమే ఇవ్వడం, మేకర్‌ఫీల్డ్ పార్లమెంటరీ ఉపఎన్నికలో బర్న్‌హామ్ ఘన విజయం సాధించడంతో స్టార్మర్ నాయకత్వంపై ప్రశ్నలు వస్తున్నాయి. ఎప్‌స్టీన్ కుంభకోణంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న తన స్నేహితుడు పీటర్ మాండెల్సన్‌ను అమెరికాలో యూకే రాయబారిగా నియమించాలనే స్టార్మర్ నిర్ణయంపైనా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ పరిస్థితుల నేపథ్యంలో తాను ప్రధాని పదవి నుంచి వైదొలగాలని సహచర మంత్రులతోపాటు సొంత పార్టీ ఎంపీల నుంచి ఆయనపై ఒత్తిడి పెరిగింది. అయినప్పటికీ తాను పదవి నుంచి వైదొలిగే ప్రసక్తే లేదని వాదిస్తూ వచ్చిన స్టార్మర్.. తాజాగా రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించడం గమనార్హం. మరోవైపు, బ్రిటన్ ప్రధానిగా కీర్ స్టార్మర్ రాజీనామా చేస్తారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ (ఆనీనిజీటె ఢసబీపూ) ఆదివారం సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. వలసలు, ఇంధన విధానాల్లో వైఫల్యాలే అందుకు కారణమని తన పోస్టులో ఆయన పేర్కొన్నారు.

# బడంగ్‌పేటలో భారీ పేలుడు

## బెంగాల్‌కు చెందిన కార్మికుడి దుర్మరణం

**రంగారెడ్డి,జూన్22 :** రంగారెడ్డి జిల్లాలోని బడంగ్‌పేట్ ప్రాంతంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. ప్రమాదవశాత్తూ పేలుడు సంభవించడంతో ఓ కార్మికుడు అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ప్రమాదం జరిగింది. మృతుడిని పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతాకు చెందిన అనూప్ ప్రధాన్‌గా (43) గుర్తించారు. జీవనోపాధి కోసం మూడు రోజుల క్రితమే ఆయన బడంగ్‌పేట్‌కు వచ్చి ఓ డెకరేషన్ గోదాంలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈ ఘటన జరిగిన సమయంలో అనూప్ ప్రధాన్ చెత్త కుప్ప సమీపంలో ఉన్నాడు. ఆ సమయంలో చెత్తలో ఉన్న గుర్తుతెలియని పదార్థం ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలింది. ఈ ఘటన తీవ్రత చాలా ఎక్కువగా ఉండటంతో అనూప్ ప్రధాన్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. పేలుడు ప్రభావం తీవ్రంగా ఉండటంతో మృతుడి శరీర భాగాలు సుమారు 50 మీటర్ల దూరం వరకు ఎగిరిపడ్డాయి. చేతులు, కాళ్లు తునాతునకలైపోవడంతో ఘటనా స్థలం భయానకంగా మారింది. ఈ దృశ్యాలను చూసిన స్థానికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న వెంటనే మీర్‌పేట్ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ఘటనా స్థలంలో ఆధారాలు సేకరించిన పోలీసులు పేలుడుకు కారణమైన పదార్థం ఏమిటన్న దానిపై దర్యాప్తు చేస్తున్నారు. ప్రస్తుతం పేలుడు ప్రమాదవశాత్తూ జరిగిందా, లేక చెత్త కుప్పలో పేలుడు పదార్థం ఉండటమే కారణమా అనే కోణాల్లో విచారణ చేపట్టారు. అవసరమైతే బాంబ్ స్క్వాడ్, ఫోరెన్సిక్ నిపుణుల సహాయంతో మరిన్ని వివరాలు సేకరించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. పేలుడుకు సంబంధించిన పూర్తి వివరాలు ఫోరెన్సిక్ నివేదిక అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది.



# నటుడు చిరంజీవితో బిజెపి అధ్యక్షుడు రామ్ భేటీ

## మోడీ 12 పాలనపై పుస్తకాలు అందచేత

**హైదరాబాద్,జూన్22(ఆర్ఎన్ఎ):** తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవిని భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీకి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో రాజకీయ, సినీ వర్గాల్లో విస్తృత చర్చకు దారితీసింది. గత కొన్నేళ్లుగా ప్రత్యక్ష రాజకీయాలకు పూర్తిగా దూరంగా ఉంటూ సినిమాలపైనే దృష్టి సారించిన చిరంజీవిని బీజేపీ కీలక నేత కలవడం వెనుక అసలు ఉద్దేశం ఏమిటనే అంశంపై పలు ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి. బీజేపీ వర్గాల సమాచారం ప్రకారం.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం 12 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా 'మహాజన్ సంపర్క్ అభియాన్' కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమం ద్వారా కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ఆర్థిక సంస్కరణలను వివిధ రంగాల ప్రముఖులకు వివరించే ప్రయత్నం జరుగుతోంది. అందులో భాగంగానే రామచందర్ రావు చిరంజీవిని కలిసి మోదీ ప్రభుత్వ పనితీరుకు సంబంధించిన ప్రత్యేక పుస్తకాలు, ప్రచార పత్రాలను అందజేసినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా దేశ అభివృద్ధి, ఆర్థిక ప్రగతి, సామాజిక రంగాల్లో జరిగిన మార్పులపై ఇద్దరి మధ్య చర్చ జరిగినట్లు సమాచారం. అధికారికంగా ఇది మర్యాదపూర్వక భేటీగా చెబుతున్నప్పటికీ, రాజకీయ వర్గాల్లో మాత్రం పలు విశ్లేషణలు కొనసాగుతున్నాయి. గతంలో ప్రజారాజ్యం పార్టీని స్థాపించి రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన చిరంజీవి, అనంతరం ఆ పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేసి కేంద్ర మంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత రాజకీయాలకు దూరంగా ఉంటూ సినిమాల్లో బిజీ అయిన ఆయన మళ్లీ యాక్టివ్ పాలిటిక్స్‌లోకి వస్తారా? అనే ప్రశ్న మరోసారి తెరపైకి వచ్చింది. ముఖ్యంగా బీజేపీతో ఆయన సాన్నిహిత్యం పెరుగుతుందా అనే అంశంపై కూడా చర్చ జరుగుతోంది. చిరంజీవి తమ్ముడు, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ప్రస్తుతం ఎన్డీయే కూటమిలో కీలక భాగస్వామిగా కొనసాగుతున్నారు.

# నిరుద్యోగానికి తోడు.. ఆర్థిక సమస్యలు

## ఉరేసుకుని యువకుడు బలవన్మరణం

**నిజామాబాద్, జూన్ 22 :** ఎంబీఏ విద్య పూర్తి చేసినప్పటికీ ఇప్పటివరకు ఉద్యోగం లభించకపోవడం, ఉండడానికి సొంత ఇల్లు కూడా లేకపోవడంతో మానసికంగా బాధపడుతూ ఓ యువకుడు మనస్థాపానికి గురై ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన సిరికొండ మండలంలోని గడ్కోల్ గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని గడ్కోల్ గ్రామానికి చెందిన దోమ్మటి నితిన్ గౌడ్ (27) తమ గ్రామంలో సొంత ఇల్లు లేకపోవడం, అలాగే ఎంబీఏ విద్య పూర్తి చేసినప్పటికీ ఇప్పటివరకు ఉద్యోగం లభించకపోవడంతో మానసికంగా బాధపడుతూ ఉండేవాడని స్థానికులు తెలిపారు. కాగా సోమవారం లోంక గుడి కి వెళ్తున్నానని ఇంటి నుండి తన ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. అనంతరం లోంక తండా దాటిన తర్వాత రోడ్డుపై తన బైకు నిలిపి సమీప అటవీ ప్రాంతంలో టేకు చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేపట్టినట్టు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

# ఇసుక క్వారీ మార్చాలంటూ కలెక్టర్‌కు వినతి

**కరీంనగర్,జూన్22 :** వీణవంక మండలంలోని పోతిరెడ్డిపల్లి పేరుమీద ఉన్న ఇసుక క్వారీని కొండపాకకు మార్చాలని కొండపాక ఉపసర్పంచ్, వార్డు సభ్యులు కరీంనగర్ కలెక్టర్ చిత్రామిత్రాను కోరారు. ఈ మేరకు వారు సోమవారం ప్రజావాణి కలెక్టర్ చిత్రమిత్రాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొండపాక రెవెన్యూ పరిధిలోని మానేరువాగుపై ఇసుక క్వారీ ఏర్పాటు చేసి పోతిరెడ్డిపల్లి పేరు మీద నడుపుతున్నారని అన్నారు. దీంతో కొండపాక గ్రామస్తులమైన తాము ఉపాధి కోల్పోతున్నామని, పోతిరెడ్డిపల్లి నుండి కొండపాక పేరుమీద మార్చి తమకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను విన్నవించినట్లు తెలిపారు.

# ఒకే ఇంట్లో నలుగురు అనుమానాస్పద మృతి

## భార్యాభర్తలతో పాటు, మరో ఇద్దరి మృతదేహాలుగా గుర్తింపు

**నల్లగొండ, జూన్ 22 :** నల్లగొండ పట్టణంలోని తెలంగాణ కాలనీలో విషాదం చోటుచేసుకుంది. ఒకే ఇంట్లో నలుగురు మృతి చెందిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. మృతుల్లో భార్యాభర్తలు సుల్తాన్, హసీనా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మరో ఇద్దరి వివరాలు ఇంకా తెలియరాలేదు. నల్లగొండ ప్రకాశం బజార్‌లో సుల్తాన్ బ్యాగుల వ్యాపారం నిర్వహిస్తుండగా, హసీనా ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నట్లు తెలిసింది. ఈ ఘటన ఆత్మహత్యా? లేక హత్యా? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఇంట్లో నలుగురు మృతిచెందడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సంఘటనా స్థలం నుంచి ఆధారాలను సేకరిస్తున్న పోలీసులు, మృతుల బంధువులు, స్థానికులను విచారిస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

# ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా ఆందోళన!



**ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా ఆందోళన నెలకొంది. చినుకు పడడమే కష్టంగా మారింది. నైరుతి ప్రవేశించినా చుక్కనీరు చిక్కలేదు. భూములు తడవలేదు. వ్యవసాయం పూర్తిగా పడకేసింది. నదులు నోరెళ్లబెట్టాయి. భూగర్భజలాలు అడుగంటాయి. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే సాగు ఎలా ఉన్నా తాగునీటికి తీవ్ర కటకట ఏర్పడేలా ఉంది. కృష్ణా,గోదావరి నదులు వట్టిపోయాయా అన్నట్లుగా మారాయి. ఈ పాటికి గోదావరిలో ఎగువ నుంచి నీరు వచ్చేది. దీంతో సాగు సాగేదెలా అని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే రైతుల కోణంలో చూస్తే పరిస్థితి అంత సులభంగా కనిపించడం లేదు. గతంలో కొన్ని ప్రత్యామ్నాయ పంటలకు మార్కెట్ అనిశ్చితి, ధరల హెచ్చుతగ్గులు, కనీస మద్దతు ధర అమలులో ఎదురైన సమస్యలు రైతుల్లో సందేహాలను పెంచుతున్నాయి. వరికి ఉన్న మార్కెట్ భరోసా ఇతర పంటలకు లేదనే భావన రైతుల్లో కనిపిస్తోంది. వ్యవసాయం కేవలం రైతు కుటుంబానికే పరిమితం కాకుండా వ్యవసాయ కూలీలు, యంత్రాల యజమానులు, రవాణా రంగం, గ్రామీణ ఉపాధితో ముడిపడి ఉండటంతో పంటల ఎంపికపై తీసుకునే నిర్ణయాలు విస్తృత ప్రభావం చూపే అవకాశం ఉంది.**

ఎల్‌నినో ప్రస్తుత వాతావరణ పరిస్థితులపై తీవ్ర ప్రభావం చూపుతున్నదని వాతావరణ శాఖ తెలియచేస్తోంది. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు సాగే ఖరీఫ్ సీజన్ ప్రారంభ దశలోనే ఈ పరిస్థితులు కనిపించడం వల్ల వ్యవసాయ రంగం, నీటి వనరుల నిర్వహణ, గ్రామీణ జీవనోపాధులపై ప్రభావం ఎంత మేరకు ఉంటుందన్న చర్చ సాగుతోంది. అయితే వాతావరణ పరిస్థితులు నిరంతరం మారుతుంటాయని, రాబోయే రోజుల్లో వర్షాల పరిస్థితిలో మెరుగుదల సంభవించే అవకాశాన్ని కూడా కొట్టిపారేయలేమని నిపుణులు చెబుతున్నారు. తెలంగాణ రైతాంగం ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడా మృగశిర కార్తెతో పాటు ఖరీఫ్ సీజన్‌పై ఆశలు పెట్టుకుంది. జూన్ తొలి వారం నుంచే నాగలి పట్టి, నారుమళ్లు పోసి, విత్తనాలు సిద్ధం చేసుకున్న రైతులు ఆకాశం వైపు చూస్తున్నారు. అయితే సాధారణంగా కనిపించే నై రుతి వర్షపాత చురుకుదనం ఈసారి అనేక ప్రాంతాల్లో కనిపిం చకపోవడంతో వ్యవసాయ వర్గాల్లో ఆందోళన వ్యక్తమవు తోంది.

వాతావరణ నిపుణులు, అంతర్జాతీయ పరిశోధనా సంస్థలు, భారత వాతావరణ శాఖ విడుదల చేస్తున్న విశ్లేషణల ప్రకారం, పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన ఎల్‌నినో ప్రస్తుత వాతావరణ పరిస్థితులపై ప్రభావం చూపుతున్నది. వాతావరణ మార్పుల కారణంగా నైరుతి రుతుపవనాల పురోగతిపై ప్రభావం చూపుతున్నాయి. భారత వాతావరణ శాఖకు సంబంధించిన గణాంకాలను ఉటంకిస్తూ ప్రచురితమైన నివేదికల ప్రకారం, వ్యాప్తంగా సుమారు 64 శాతం లోటు వర్షపాతం నమోదైనట్లు విశ్లేషణలు సూచిస్తున్నాయి. దేశంలోని పలు రాష్ట్రాల మాదిరిగానే తెలంగాణలోనూ వర్షాల పురోగతిపై రైతులు, వ్యవసాయ నిపుణులు, నీటివనరుల ప్రణాళికాధికారులు దృష్టి సారిస్తున్నారు. జిల్లాల వారీగా, మండలాల వారీగా పరిస్థితులు భిన్నంగా ఉండే అవకాశం ఉన్నందున స్థానిక గణాంకాలను నిరంతరం సమీక్షించాల్సిన అవసరం ఉంది. వర్షపాతం ఆలస్య మవడం వల్ల సాగు పనుల షెడ్యూల్, విత్తనాల వినియోగం, నీటి అవసరాలు, వ్యవసాయ పెట్టుబడులపై ప్రభావం పడే అవకాశం ఉంది. ప్రకృతి ప్రభావంతో పాటు జల నిర్వహణ సామర్థ్యం, నీటి నిల్వల వినియోగం, సాగునీటి ప్రణాళికలు కూడా ప్రస్తుత పరిస్థితుల్లో చర్చకు వస్తున్నాయి. అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించడం, చెరువుల పునరుద్ధరణ, వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పరిరక్షణ వంటి అంశాలపై మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. గోదావరి పరివాహక ప్రాంతంలోని మౌలిక వసతుల సమర్థ వినియోగం, రిజర్వాయర్ల నిర్వహణ, నీటి పంపిణీ వ్యవస్థల మెరుగుదల వంటి అంశాలు కూడా చర్చలో ఉన్నాయి. అయితే ఈ అంశాలపై సాంకేతిక, ఆర్థిక, పరిపాలనా కోణాలను సమగ్రంగా పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ప్రస్తుత పరిస్థితి ఒకవైపు వాతావరణ ప్రభావాన్ని గుర్తు చేస్తే, మరోవైపు నీటి వనరుల దీర్ఘకాలిక నిర్వహణ ఎంత కీలకమో కూడా స్పష్టం చేస్తోంది. వర్షాలు ఆలస్యమవడం, సాధారణ స్థాయిలో లేకపోవడం వంటి పరిస్థితులు కొత్తవి కావు. అయితే వాతావరణ మార్పుల ప్రభావం పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ముందస్తు ప్రణాళిక, శాస్త్రీయ వ్యవసాయం, సమర్థవంతమైన జల నిర్వహణ మరింత కీలకంగా మారాయి. ప్రభుత్వం, వాతావరణ నిపుణులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, రైతు సంఘాలు, స్థానిక సంస్థలు సమన్వయంతో పనిచేస్తే ప్రస్తుత సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనే అవకాశాలు ఉన్నాయి. రైతులకు సమయానుకూల సమాచారం, పంటలపై శాస్త్రీయ మార్గదర్శకాలు, నీటి వనరుల సమర్థ వినియోగం వంటి అంశాలు రాబోయే రోజుల్లో కీలకపాత్ర పోషించనున్నాయి. ప్రకృతి సవాళ్లను పూర్తిగా నియంత్రించడం సాధ్యం కాకపోయినా, వాటి ప్రభావాన్ని తగ్గించే ముందస్తు చర్యలు మాత్రం మన చేతుల్లోనే ఉన్నాయి. అందుకే ఆందోళన కంటే అప్రమత్తతకు, విమర్శల కంటే కార్యాచరణకు, నిరాశ కంటే ముందుచూపుకు ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంది. నీటి లభ్యతపై అనిశ్చితి కొనసాగుతున్న నేపథ్యంలో రైతులు వరి సాగుకు బదులుగా తక్కువ నీటి అవసరం ఉండే పొద్దుతిరుగుడు, పత్తి, మొక్కజొన్న, ఉల్లి వంటి ప్రత్యామ్నాయ పంటలను పరిశీలించాలని ప్రభుత్వం సూచిస్తోంది. పరిమిత నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలనే ఉద్దేశంతో ఈ సూచనలు చేస్తున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి.

# సింధుజలాలపై అవసరమైతే యుద్ధం

**భారత్‌తో తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధం**

**పాక్ రక్షణ మంత్రి ఖవాజా ప్రేలాపనలు**



**ఇస్లామాబాద్, జూన్ 22 :** సింధు జలాల కోసం అవసరమైతే భారత్‌తో యుద్ధం చేస్తామని పాక్ ప్రగల్భాలు పలికింది. సింధు జలాల ఒప్పందం విషయంలో వెనక్కి తగ్గేది లేదని భారత్ స్పష్టం చేసిన నేపథ్యంలో, పాకిస్థాన్ రక్షణమంత్రి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. భారత్ చర్యలు తమ నీటి సరఫరాకు ముప్పు కలిగిస్తున్నాయని, అవసరమైతే ఆ దేశంపై యుద్ధానికి వెళ్లేందుకు కూడా సిద్ధంగా ఉన్నామని పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ తాజాగా హెచ్చరించారు. పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం సింధు జలాల ఒప్పందం అమలును భారత్ నిలిపివేసిన సంగతి తెలిసిందే. ఉగ్రవాదానికి పూర్తిగా, విశ్వసనీయంగా అడ్డుకట్ట వేయకపోతే ఒప్పందాన్ని పునరుద్ధరించే ప్రసక్తే లేదని భారత్ తేల్చి చెప్పింది. కాగా, పాకిస్థాన్‌కు వచ్చే నీటి ప్రవాహాన్ని తగ్గించే లేదా అడ్డుకునే ప్రయత్నాలు జరిగితే అది జాతీయ భద్రతా సమస్యగా మారుతుందని ఆసిఫ్ అన్నారు. పాక్ ఆర్థిక వ్యవస్థ, కోట్లాది మంది ప్రజల జీవనాధారం సింధు నదీ వ్యవస్థపై ఆధారపడి ఉందని ఆసిఫ్ అన్నారు. ఈ నేపథ్యంలో నీటి హక్కులను కాపాడుకునేందుకు అన్ని మార్గాలనూ ఉపయోగిస్తామని, అవసరమైతే యుద్ధం వరకు వెళ్లడానికి కూడా వెనుకాడబోమని ఆసిఫ్ హెచ్చరించారు. సింధు జలాల ఒప్పందం 1960లో కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం సింధు నదీ వ్యవస్థలోని ఆరు నదులను భారత్, పాకిస్థాన్‌కు సమానంగా కేటాయించారు. ఒప్పందం ప్రకారం రావి, బియాస్, స్లటెజ్ నదులపై భారత్‌కు హక్కులుంటాయి. సింధు, జీలం, చీనాబ్ నదులపై పాకిస్థాన్‌కు హక్కులుంటాయి. అలాగే పాకిస్థాన్‌కు కేటాయించిన మూడు నదులపై కూడా భారత్‌కు కొన్ని పరిమిత హక్కులు ఉన్నాయి. పాక్‌కు కేటాయించిన నదులపై భారత్ జలవిద్యుత్ ప్రాజెక్టులు నిర్మించుకోవచ్చు. తాగునీరు, గృహ అవసరాలకు నీటిని వినియోగించుకోవచ్చు. అలాగే పరిమిత స్థాయిలో సాగునీటికి కూడా ఉపయోగించు కోవచ్చు. అయితే నదుల ప్రవాహాన్ని పూర్తిగా అడ్డుకునే హక్కు భారత్‌కు లేదు. ఃగా, ఇటీవలి ఉగ్రవాద ఘటనల తర్వాత భారత్ ఈ ఒప్పంద అమలును నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ఉగ్రవాదానికి మద్దతు కొనసాగితే పాత విధానంలో ఒప్పందం కొనసాగదని భారత్ స్పష్టం చేసింది. ఇటీవలి కాలంలో చీనాబ్, జీలం నదులపై కొన్ని ప్రాజెక్టులు నిర్మిస్తోంది. ఈ నిర్మాణాలపై పాకిస్థాన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోంది.

## ఖతార్ గ్యాస్ క్షేత్రంలో భారీ పేలుడు

**54మందికి తీవ్ర గాయాలు..18మంది ఆచూకీ గల్లంతు**



**ఖతార్, జూన్ 22 :** ప్రపంచ గ్యాస్ వాణిజ్యానికి ఆయువుపట్టు వంటి ఖతార్ రస్ లఫాన్ క్షేత్రంలో బర్జాన్ ప్లాంట్‌లో ఆదివారం అర్ధరాత్రి భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో 54 మంది గాయపడగా.. 18మంది జాడ గల్లంతైంది. ఈ పేలుడుతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. అయితే పేలుడుకు గల కారణాలు తెలియాల్సి ఉంది. అలాగే ప్రాణనష్టంపై వివరాలు అందాల్సి ఉంది. వాస్తవానికి ఇరాన్-అమెరికా యుద్ధం వేళ ఐఆర్‌జీసీ దళాలు ఈ గ్యాస్ క్షేత్రాన్ని లక్ష్యంగా చేసుకొని భారీగా దాడులు చేశాయి. దీంతో గ్యాస్ ప్లాంట్ దెబ్బతిని భారీగా ఉత్పత్తి సామర్థ్యం పడిపోయింది. కొన్నాళ్ల క్రితమే ఇరాన్-అమెరికా మధ్య ఉద్రిక్తతలు తగ్గు ముఖం పట్టడంతో గ్యాస్ ఉత్పత్తి తిరిగి ప్రారంభించేందుకు ఖతార్ చర్యలు చేపట్టింది. ఖతార్ రాజధాని దోహాకు ఈశాన్యంగా 80 కిలోమీటర్ల దూరంలో పర్షియన్ గల్ఫ్ తీరంలో రస్ లఫాన్ నగరం ఉంది. భౌగోళికంగా వ్యూహాత్మక ప్రదేశంలో ఉండటంతో ఇది ఆసియా, ఐరోపా ఎగుమతులకు అత్యంత అనువైన ప్రదేశం. ఇక్కడి నుంచి గ్యాస్ దాదాపు 30 దేశాలకు పైగా ఎగుమతి అవుతోంది. వీటిల్లో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలైన జపాన్, దక్షిణ కొరియా, భారత్, ఐరోపా సమాఖ్య, చైనా వంటి దేశాలు ఉన్నాయి. భారత ఎల్ఎన్‌జీ దిగుమతుల్లో ఖతార్ నుంచి 40-47శాతం వరకు హర్మూజ్ జలసంధి దాటుకొని వస్తున్నాయి. ఈ గ్యాస్ క్షేత్రాన్ని ఖతార్ ఎనర్జీనే నిర్వహిస్తుంది. భారత్-ఖతార్ మధ్య 2024లో 78 బిలియన్ డాలర్ల విలువైన ఒప్పందం జరిగింది. దీని ప్రకారం 2028 నుంచి 20 ఏళ్లపాటు ఏటా 7.5 మిలియన్ టన్నుల ఎల్ఎన్‌జీ సరఫరా చేయాల్సి ఉంటుంది. ఖతార్ ఎల్ఎన్‌జీ భారత్‌లో విద్యుత్తు, ఎరువుల ఉత్పత్తి, పరిశ్రమలు, గృహోపయోగానికి చాలా కీలకం. అమెరికా, ఆఫ్రికాతో పోల్చుకొంటే ఇక్కడి నుంచి భారత్‌కు గ్యాస్ తరలించడం చాలా చౌక.



## మాస్కోపై విరుచుకుపడ్డ ఉక్రెయిన్

**డ్రోన్‌లతో వరుస దాడులతో రష్యా ఉక్కిరిబిక్కిరి**

**మాస్కో, జూన్22 :** రష్యాపై ఉక్రెయిన్ భీకర దాడులు కొనసాగిస్తోంది. మాస్కో, దాని పరిసరాల ప్రాంతాలే లక్ష్యంగా ఆదివారం వందల డ్రోన్లతో విరుచుకుపడింది. వాటిలో దాదాపు 60 డ్రోన్లను కూల్చేసినట్లు రష్యా ఎయిర్ డిఫెన్స్ అధికారులు వెల్లడించారు. దాడుల నేపథ్యంలో నగరంలోని నాలుగు విమానాశ్రయాలు మూతపడ్డాయి. క్రిమియాపై కూడా ఉక్రెయిన్ దాడులకు పాల్పడుతుండడంతో అదనపు భద్రతా చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ముందుజాగ్రత్త చర్యగా క్రిమియాలో సోమవారం జరగాల్సిన అన్ని బహిరంగ కార్యక్రమాలను అధికారులు రద్దు చేశారు. సాధ్యమైనంత వరకు విద్యుత్ వినియోగాన్ని తగ్గించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మరోవైపు.. ఇంధన సదుపాయాలు, చమురు శుద్ధి కేంద్రాలపై కీవ్ దాడులు చేయడంతో క్రిమియా ప్రాంతంలో ఇంధన సరఫరాకు తీవ్ర అంతరాయం నెలకొంది. దీంతో నగరవ్యాప్తంగా ఉన్న పెట్రోల్ స్టేషన్లలో ప్రజలకు, ప్రభుత్వేతర సంస్థలకు ఇంధన విక్రయాలను నిలిపివేశారు. విరామం ఇవ్వకుండా ఉక్రెయిన్ ప్రతిరోజూ వందల డ్రోన్‌లతో విరుచుకు పడుతుండడంతో మాస్కో ఉక్కిరిబిక్కిరవుతోంది. ఈ క్రమంలోనే ఉక్రెయిన్‌లోని దక్షిణ ఒడెసా ప్రాంతంపై రష్యా చేసిన ప్రతిదాడుల్లో ఒకరు మరణించగా.. ముగ్గురు గాయపడినట్లు అధికారులు వెల్లడించారు. ఈ దాడుల్లో పలు వాహనాలు ధ్వంసమవ్వగా.. ఇంధన నిల్వ ట్యాంకులలో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి.

## సిఎం హోదాలో విజయ్ తొలి పుట్టినరోజు



**చెన్నై, జూన్ 22 :** తమిళనాడు రాజకీయాల్లో ప్రభంజనం సృష్టిస్తూ ఎన్నికల్లో పోటీచేసిన తొలిసారే విజయాన్ని సాధించిన విజయ్ ముఖ్యమంత్రి హోదాలో సోమవారం పుట్టినరోజు చేసుకున్నారు. దీంతో సినీ, రాజకీయ ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం రాత్రి శివకాశిలో గంటసేపు బాణాసంచా కాల్చి అభిమానులు సందడి చేశారు. తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్‌కు జన్మదిన శుభాకాంక్షలు. మీరు దీర్ఘాయుష్షుతో జీవించాలని ప్రార్థిస్తున్నాను అంటూ ప్రధాని మోదీ సందేశం తెలిపారు. విజయ్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు. అన్ని ప్రయత్నాలలో మీరు విజయం సాధించాలని ఆకాంక్షిస్తున్నాను. తమిళ ప్రజల హక్కులు, గౌరవం, ఆకాంక్షలను పరిరక్షించడంలో, రాష్ట్ర ప్రగతి కోసం కలిసి పనిచేయడంలో నేను మీకు అండగా నిలుస్తానని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ అభినందనలు తెలిపారు. విజయ్‌కు జన్మదిన శుభాకాంక్షలు. మీరు ఆరోగ్యంగా, సంతోషంగా ఉండాలని కోరుకుంటున్నా. మీరు చేపట్టే అన్నీ ప్రయత్నాల్లో విజయం సాధించాలని.. ప్రజలకు ఇలానే సేవ చేయాలని ఆకాంక్షిస్తున్నానని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు తెలియచేశారు.

## అమెరికాలో మరో తెలుగు విద్యార్థి మృతి

**హైదరాబాద్, జూన్ 22 :** ఉన్నత విద్య కోసం అమెరికాకు వెళ్లిన మరో తెలుగు విద్యార్థి అనూహ్యంగా ప్రాణాలు కోల్పోయాడు. తెలంగాణకు చెందిన 26 ఏళ్ల అరుణ్ సాయి రెడ్డి బొలెందుల అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. అరుణ్ స్వస్థలం మహబూబ్‌నగర్. ప్రస్తుతం ఫ్లోరిడాలోని టెంపాలో నివసిస్తోన్న అతడు.. స్టెమ్ ఓపీటీలో ఉన్నాడు. ఫుల్ టైమ్ ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేస్తోన్న అరుణ్.. జూన్ 19న ఉన్నట్టుండి అనారోగ్యానికి గురయ్యాడు. ఆసుపత్రికి తరలించినప్పటికీ ఫలితం లేకపోయింది. చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయాడు. మృత దేహాన్ని స్వదేశానికి తరలించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

## తల్లి మందలింపుతో పారిపోయిన అక్కాచెల్లెళ్లు

**ఏలూరులో ప్రత్యక్షమైన సోదరీమణులు**

**హైదరాబాద్, జూన్ 22 :** తల్లి మందలించిందని ఇంటి నుంచి వెళ్లిపోయిన ముగ్గురు అక్కాచెల్లెళ్ల ఆచూకీని పోలీసులు కనుగొన్నారు. హైదరాబాద్‌లో అదృశ్యమైన ఆ ముగ్గురూ ఏపీలో ప్రత్యక్షమయ్యారు. ఈ ఘటన ఫలక్‌నుమా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఫోన్ ఎక్కువగా చూస్తున్నారని తన ముగ్గురు కుమార్తెలను తల్లి మందలించింది. దీంతో ఆ ముగ్గురూ ఇంటి నుంచి వెళ్లిపోయారు. దీంతో తన పిల్లలు కనిపించడం లేదని వారి తల్లి పోలీసులను ఆశ్రయించారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టగా.. ఏలూరులో ఉన్నట్లు తేలింది. వారిని తిరిగి హైదరాబాద్ తీసుకొస్తున్నారు.



## అమెరికాకు షాకిచ్చిన చైనా

**పలు రక్షణ కంపెనీలపై ఆంక్షలు**

**బీజింగ్,జూన్22 :** అమెరికాకు చెందిన 10 సైనిక సంబంధిత కంపెనీలపై చైనా ఆంక్షలు విధించింది. ఆయా కంపెనీలకు పౌర-మిలిటరీ వినియోగ వస్తువుల ఎగుమతిని నిషేధిస్తున్నట్లు తెలిపింది. వీటిల్లో రేథియాన్, లాక్‌హీడ్ మార్టిన్ వంటి ప్రముఖ సంస్థలు ఉన్నాయి. అగ్రరాజ్యం ఇటీవల తమ రక్షణ రంగ కాంట్రాక్టుల్లో చైనా టెక్ కంపెనీలను నిషేధించిన నేపథ్యంలో బీజింగ్ ఈ చర్యలు చేపట్టింది. దీంతో పాటు అమెరికాకు చెందిన 46 కంపెనీల నుంచి ఉత్పత్తులు కొనుగోలు చేయకుండా తమ ప్రభుత్వ రంగ సంస్థలను నిరోధించనున్నట్లు చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. అంతే కాకుండా ఇతర దేశాలు చైనా నుంచి కొనుగోలు చేసిన వస్తువులను.. ఆంక్షలకు గురైన అమెరికా కంపెనీలకు బదిలీ చేయడాన్ని నిషేధిస్తున్నట్లు తెలిపింది. చైనా సైన్యంతో సంబంధాలు ఉన్నాయని ఆరోపిస్తూ.. అలీబాబా, బైడూ సహా పలు టెక్ కంపెనీలపై ఈ నెల ఆరంభంలో అమెరికా రక్షణ శాఖ నిషేధం విధించింది. ఇకపై ఆయా కంపెనీలు అగ్రరాజ్య సైనిక కాంట్రాక్టులను పొందలేవని తెలిపింది. ఈ ఏడాది మే నెలలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చైనాలో పర్యటించిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో భేటీ అయిన ట్రంప్.. ఇరు దేశాల మధ్య పరస్పర వాణిజ్య సహకారంపై అంగీకారానికి వచ్చారు. అయితే, నెల తిరక్కుండానే బీజింగ్ కంపెనీలపై అగ్రరాజ్యం ఆంక్షలు విధించడం గమనార్హం. దీంతో బీజింగ్ కూడా ప్రతిచర్యలు చేపట్టింది.



## సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటన

- **నాంపల్లి కోర్టుకు హాజరుకాని అల్లు అర్జున్**
- **షూటింగ్‌ల కారణంగా రాలేకపోయారని వివరణ**
- **విచారణ జూలై 6కు వాయిదా వేసిన కోర్టు**



**హైదరాబాద్, జూన్ 22 :** హైదరాబాద్‌లో సంచలనం సృష్టించిన సంధ్యా థియేటర్ తొక్కిసలాట ఘటనకు సంబంధించిన కేసుపై నాంపల్లి కోర్టులో సోమవారం విచారణ జరిగింది. ఈ కేసులో నిందితులుగా పేర్కొన్న పలువురు కోర్టు ముందు హాజరుకాగా, సినీ నటుడు అల్లు అర్జున్ వ్యక్తిగత కారణాలతో హాజరు కాలేకపోయారని ఆయన తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. సంధ్య థియేటర్ కేసులో నాంపల్లి కోర్టుకు సినీనటుడు అల్లు అర్జున్ హాజరు కాలేదు. షూటింగ్ వల్ల వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని ఆయన కోరినట్లు సమాచారం. ఈ కేసుకు సంబంధించి ఇవాళ కోర్టుకు హాజరుకావాలని 19 మంది నిందితులకు ఇటీవల నాంపల్లి కోర్టు ఆదేశాలు జారీ చేసింది. అయితే, అల్లు అర్జున్ మినహా మిగతా నిందితులంతా న్యాయమూర్తి ఎదుట హాజరై బాండ్లపై సంతకాలు చేశారు. అనంతరం కేసు విచారణను న్యాయమూర్తి కేసు విచారణను జులై 6కి వాయిదా వేశారు. అనంతరం ఈ కేసు విచారణను జులై 6వ తేదీకి న్యాయమూర్తి వాయిదా వేశారు. ఈ కేసులో అల్లు అర్జున్‌ను ఎ11 నిందితుడిగా పోలీసులు చేర్చిన విషయం తెలిసిందే. వ్యక్తిగతంగా అర్జున్ కోర్టు ముందు హాజరు కావాలని సమన్లు జారీ చేశారు. అయితే అల్లు అర్జున్ గైర్హాజరుకు గల కారణాలను న్యాయస్థానానికి ఆయన తరపు న్యాయవాది వివరించారు. సంధ్యా థియేటర్ యాజమాన్యాన్ని తొలి పదిమంది జామితాలో చేర్చగా, మొత్తం 23 మందిపై పోలీసులు ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ కేసులో 19 మంది నిందితులకు నాంపల్లి కోర్టు ఇప్పటికే సమన్లు జారీ చేసింది. ఈ ఘటన 2024 డిసెంబర్ 4వ తేదీన పుష్ప-2 బెనిఫిట్ షో సందర్భంగా హైదరాబాద్‌లోని సంధ్యా థియేటర్ వద్ద చోటుచేసుకుంది. భారీ సంఖ్యలో అభిమానులు థియేటర్‌కు చేరుకోవడంతో తొక్కిసలాట జరిగింది. ఘటనలో రేవతి అనే మహిళ మృతిచెందగా, ఆమె కుమారుడు శ్రీతేజ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ కేసు దర్యాప్తు పూర్తిచేసిన పోలీసులు 23 మందిని నిందితులుగా పేర్కొంటూ నాంపల్లి కోర్టుకు ఛార్జ్‌షీట్ సమర్పించారు. నిందితుల వ్యక్తిగత హాజరు పక్రియ పూర్తయిన తర్వాత ఈ కేసులో పూర్తిస్థాయిలో విచారణ చేపట్టేందుకు నాంపల్లి కోర్టు సిద్ధమవుతోంది. ఈ కేసు సినీ, రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారగా, కోర్టు తదుపరి విచారణలో కీలక పరిణామాలు చోటుచేసుకునే అవకాశం ఉంది.

# కేదార్నాథ్‌ను దర్శించుకున్న గూడూరు

- 12జ్యోతిర్లింగాలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన గూడూరు సమత మహేష్ గౌడ్
- పరమశివుని దర్శనంతో జన్మ ధన్యమైంది: గూడూరు మహేష్ గౌడ్

**హైదరాబాద్, జూన్ 22 (జనంవార్త) :** కేదార్ నాథ్ మహా పరమశివుని జ్యోతిర్లింగాలను దర్శించుకోవడంతో నా జన్మ ధన్యమైందని గూడూరు మహేష్ గౌడ్ అన్నారు. ఉత్తరాఖండ్ రుద్ర ప్రయాగ్ జిల్లాలోని కేదార్నాథ్ హిందువులకు అత్యంత పవిత్రమైన చార్ధామ్ యాత్రలో భాగంగా యంనోత్రి,గంగోత్రి, కేదార్నాథ్,బద్రీనాథ్ పుణ్యక్షేత్రాలను గూడూరు మహేష్ గౌడ్ ప్రాణ స్నేహితులతో దర్శించుకున్నారు. అనంతరం మందాకిని నది తీరాన మహా పరమశివుని 12 జ్యోతిర్లింగాలను గూడూరు సమత మహేష్ గౌడ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా గూడూరు మహేష్ గౌడ్ మాట్లాడుతూ శ్రీ కంఠమహేశ్వర స్వామి,కోట మైసమ్మ తల్లి కరుణ కటాక్షంతో కేదార్నాథ్ లోని 12 జ్యోతిర్లింగాలను పూర్తి చేసుకున్న సందర్భంగా మహాశివుని దర్శించుకునే మహా పుణ్యభాగ్యం ఆ భగవంతుడు నాకు అనుగ్రహించాడని గూడూరు మహేష్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో గూడూరు సమత మహేష్ గౌడ్, బబ్బూరి రమాదేవి శ్రీకాంత్ గౌడ్,పాండల అపర్ణ శివకుమార్ గౌడ్,పోచారం మాజీ సర్పంచ్ చెరుకు సరిత బద్రినారాయణ గౌడ్, భవాని శివశంకర్ తదితరులు ఈ యాత్రలో పాల్గొన్నారు.









## నాగారం డివిజన్‌ను రెండు భాగాలుగా విభజించాలి

**బిజెపి ఆధ్వర్యంలో కమిషనర్ వినయ్ కృష్ణ రెడ్డికి వినతిపత్రం**

**నాగారం, జూన్ 22 (జనం వార్త) :** నాగారం డివిజన్ ను రెండు డివిజన్లుగా విభజించాలని నాగారం బిజెపి ఆధ్వర్యంలో మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ వినయ్ కృష్ణారెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు నాగరాజు,మాజీ జడ్పీటీసీ మునిగంటి సురేష్,జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్ధవరం లక్ష్మీ,మాజీ అధ్యక్షులు బుద్దవరం వేణుగోపాల్,డివిజన్ ప్రధాన కార్యదర్శిలు మామిడి జంగారెడ్డి, పోతం శెట్టి వెంకటేశ్వరరావు, ఏనుగు మహేందర్ రెడ్డి,సీనియర్ నాయకులు జెమ్మల్ల మధుగౌడ్,ఎలసాని నాగరాజు యాదవ్, సురేందర్ రెడ్డి, విజయలక్ష్మీ, చంద్రశేకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## అక్రమ నిర్మాణాలపై ప్రజావాణిలో ఫిర్యాదు

**నాగారం,జూన్ 22 (జనంవార్త) :** తప్పుడు పత్రాలను సృష్టించి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా వాణిలో బైరెడ్డి మల్లారెడ్డి,కొమిరెల్లి సుధాకర్ రెడ్డి సోమవారం ఫిర్యాదు చేశారు.నాగారం డివిజన్ పరిధిలోని సర్వే నెంబర్ 332 అన్నారాయని చెరువు శిఖం స్థలాన్ని గ్రామ కంఠం మని తప్పుడు పత్రాలను సృష్టించి అక్రమ నిర్మాణం చేపడుతున్నారని రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన చర్యలు శూన్యమని జిల్లా అదనపు కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు.

## ఫెర్టిలైజర్స్ దుకాణాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

**కొత్తగూడెం, జూన్ 22:** మొరంపల్లి బంజర గ్రామంలోని శ్రీ లక్ష్మి గణపతి ఫెర్టిలైజర్ దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులు తగినంతగా అందుబాటులో ఉన్నాయా లేదా అనే విషయాన్ని వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. దుకాణంలోని పత్తి విత్తనాల ప్యాకెట్లు, వివిధ రకాల ఎరువులు, పురుగుల మందుల నిల్వలను తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లను పరిశీలించి నిల్వలు, విక్రయాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. గోదాములో నిల్వ ఉంచిన యూరియా బస్తాలను పరిశీలించి నిల్వల పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు విక్రయించాలని డీలర్లకు సూచించారు. రైతులకు నాణ్యమైన వ్యవసాయ ఇన్‌పుట్లు అందించడంలో నిర్లక్ష్యం ఉండరాదన్నారు. స్టాక్ రిజిస్టర్లను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ నిల్వలు, విక్రయాల వివరాలను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. వ్యవసాయ సీజన్‌లో రైతులకు అవసరమైన ఎరువుల సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా వ్యవసాయ శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. అక్రమ నిల్వలు, అధిక ధరలకు విక్రయాలు, నిబంధనల ఉల్లంఘనలు జరిగితే సంబంధిత వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట కలెక్టర్ వెంట బూర్గంపాడు తాసిల్దార్ కె.ఆర్.కె.వి ప్రసాద్,డిప్యూటీ తాసిల్దార్ సమ్మయ్య, ఎంపీడీవో జమ్మల రెడ్డి, ఎంపీవో, కళాశాల ప్రిన్సిపాల్ నాగజ్యోతి, వ్యవసాయ శాఖ అధికారి ఏవో శంకర్, హౌసింగ్ ఏఈ, జి పి ఓ లు తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి

**బూర్గంపాడులో గురుకుల పాఠశాల, ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ అంకిత్**

**భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 22:** బూర్గంపాడు మండలంలో జిల్లా కలెక్టర్ అంకిత్ సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మండలంలోని తెలంగాణ అల్పసంఖ్యాక గురుకుల పాఠశాలతో పాటు మొరంపల్లి బంజర గ్రామంలోని శ్రీ లక్ష్మి గణపతి ఫెర్టిలైజర్ దుకాణాన్ని సందర్శించి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, ఆహార నాణ్యత, రైతులకు ఎరువుల లభ్యత తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మొదట తెలంగాణ అల్పసంఖ్యాక గురుకుల పాఠశాలను సందర్శించిన కలెక్టర్ పాఠశాలలోని కిచెన్ షెడ్, స్టోర్ రూమ్, తరగతి గదులు, వసతి గృహాలను పరిశీలించారు. కిచెన్ షెడ్‌లో వంటల తయారీ విధానాన్ని పరిశీలించి విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన, పోషకాహారం అందించాలని అధికారులను ఆదేశించారు. వంటశాల, భోజనశాల పరిసరాల్లో పరిశుభ్రతను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. మెనూ చార్ట్‌ను పరిశీలించి విద్యార్థులకు మెనూ ప్రకారమే ఆహారం అందుతున్నదా లేదా అని ఆరా తీశారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని మెనూ అమలులో ఎలాంటి లోపాలు తలెత్తకుండా చూడాలని సూచించారు. అనంతరం స్టోర్ రూమ్‌ను పరిశీలించి నిల్వ ఉంచిన బియ్యం, పప్పులు, నిత్యావసర సరుకులు, కూరగాయల నాణ్యతను తనిఖీ చేశారు. ఎప్పటికప్పుడు తాజా కూరగాయలను మాత్రమే వంటకు వినియోగించాలని, ఆహార పదార్థాల నిల్వ, వినియోగంలో నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యత విషయంలో రాజీ పడవద్దని సూచించారు. విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్ పాఠశాలలో అందుతున్న విద్య, వసతి, భోజనం, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలపై వివరాలు తెలుసుకున్నారు. నూతన విద్యా సంవత్సరంలో విద్యార్థుల చేరికలు, హాజరు శాతం, బోధనా కార్యక్రమాల నిర్వహణ తదితర అంశాలపై ఉపాధ్యాయులు, పాఠశాల నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

## ప్రహరి గోడ నిర్మించి ప్రమాదాలు నివారించాలని జోనల్ కమీషనర్ కు వినతి

**15 అడుగుల లోతట్టులో ఉండడంతో ప్రమాదాలు**

**కూకట్‌పల్లి, జూన్ 22 (జనం వార్త) :** అల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మ బండ అంబేద్కర్ నగర్ కాలనీకి ప్రక్కనే ఉన్న పిజెఆర్ నగర్ లో వాంబే పథకంలో భాగంగా నిర్మించిన ఇండ్లు సుమారు 15 అడుగుల కింది భాగంలో ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని సమస్యను పరిష్కరించడానికి ప్రహరీ గోడ నిర్మించాలని అంబేద్కర్ నగర్ కాలనీవాసులు సోమవారం కూకట్ పల్లి జోనల్ కమిషనర్ ను కలిసి విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా 15 అడుగుల లోతట్టు ప్రాంతంలో ( కింది భాగంలో ) ఉండడంతో చిన్నారులు ప్రమాదాల బారిన పడుతున్నారని సమస్యను తెలియజేస్తూ అంబేద్కర్ నగర్ కాలనీవాసులు జోనల్ కమిషనర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు గోపాస్ రవీందర్, కే.దేవయ్య లు మాట్లాడుతూ అంబేద్కర్ నగర్ కాలనీ కి ప్రక్కనే ఉన్న పిజెఆర్ నగర్ వాంబే పథకంలో భాగంగా నిర్మించిన ఇండ్లు సుమారు 15 అడుగుల కింది భాగంలో ఉండడంతో చిన్న పిల్లలు ప్రమాదాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు కాలనీల






మధ్యలో కొంత భాగం వరకు ప్రహరి నిర్మాణం చేపట్టిన అధికారులు సుమారు 200 ఫీట్ల వరకు ఎటువంటి ప్రహరి నిర్మించలేదన్నారు. దీంతో అంబేద్కర్ కాలనీలో గత కొన్ని రోజుల క్రితం ఓ బాలుడు ఆడుకుంటూ కింద పడటంతో బాలుడికి తీవ్ర గాయాలు అయ్యాయన్నారు. రెండు కాలనీల ఎత్తులో వ్యత్యాసం ఉండటంతో చిన్నారులు బయటకు వెళ్లి ఆడుకునే వీలు లేకుండా పోయిందని, చిన్నారులు ఎక్కడ కింద పడిపోతారెమో అనే భయంతో తల్లిదండ్రులు బయటకు పంపించాలంటేనే భయపడే పరిస్థితి నెలకొందని కానీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. రెండు కాలనీల మధ్య ప్రహరి గోడను నిర్మాణం చేపట్టడమో, లేదా ఫెన్సింగ్ ఏర్పాటు చేయడమో చేయాలని జోనల్ కమిషనర్ కు కోరినట్లు కాలనీవాసులు తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించాలని గతంలో చాలాసార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా చిన్నారులు ప్రమాదాల బారిన పడకుండా ఉన్నతాధికారులు త్వరితగతిన సమస్య పరిష్కారానికి కృషి చేస్తారని ఆశిస్తున్నామన్నారు.



## అభ్యున్నతిలో ఆయిల్ ఫామ్ రైతులు

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషి అభినందనీయం
- ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

**దమ్మపేట, జూన్ 22:** దమ్మపేట మండలం మల్కారం గ్రామపంచాయతీ గుత్తావారిగూడెం గ్రామంలో ఆయిల్ ఫామ్ రైతుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఆయిల్ ఫామ్ రైతుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ఘనంగా జరిగింది ఈ కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్టైల్స్ శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరుకాగా , ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయిల్ ఫామ్ రైతులు లాభసాటి దిగుబడులు సాధిస్తూ ఆర్థికంగా బలోపేతం కావడానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేస్తున్న కృషిని కొనియాడుతూ ఘనంగా సన్మానించారు ఆయిల్ ఫామ్ సాగు విస్తరణ రైతులకు గిట్టుబాటు ధరలు మార్కెటింగ్ సౌకర్యాలు మరియు రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల పట్ల రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో ఆయిల్ ఫామ్ సాగు అభివృద్ధికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విశేష కృషి చేస్తున్నారని రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు ఫలితాలను సఫలీకృతం చేయడంలో ముఖ్య పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు ఆయిల్ ఫామ్ రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని రైతులు ఆధునిక సాగు పద్ధతులను అనుసరించి మరింత అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో రైతు ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో ఆయిల్ ఫామ్ రైతులు పాల్గొన్నారు.

## ప్రేమ.. పెళ్లి.. పగ.. చివరికి త్రిపుల్ మర్డర్!

- ధనలక్ష్మిపై కక్షతో అమలు చేసిన మాస్టర్ ప్లాన్
- 17 రోజుల దర్యాప్తుతో మిస్టరీని ఛేదించిన నల్గొండ పోలీసులు

**మిర్యాలగూడ ప్రతినిధి, జూన్ 22:** మిర్యాలగూడలో ఈ నెల 5న జరిగిన అగ్నిప్రమాదం వెనుక దాగి ఉన్న త్రిపుల్ మర్డర్ మిస్టరీని నల్గొండ పోలీసులు ఛేదించారు. ప్రమాదంగా కనిపించిన ఈ ఘటన వాస్తవానికి పక్కా ప్రణాళికతో చేసిన హత్యగా తేలింది. ప్రకాశం జిల్లా సింగరాయకొండకు చెందిన కాళహస్తి శిరీష్ కుమార్‌ను ఆదివారం అరెస్ట్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మ్యాట్రిమోనీ ద్వారా ధనలక్ష్మితో పరిచయం పెంచుకున్న శిరీష్ కుమార్ అనంతరం ఆమెను వివాహం చేసుకున్నాడు. కొంతకాలం తర్వాత ఇద్దరి మధ్య విభేదాలు తలెత్తడంతో ధనలక్ష్మిపై కక్ష పెంచుకున్నాడు. ఆమెను హతమార్చాలనే ఉద్దేశంతో రోజుల తరబడి రెక్కీ నిర్వహించి హత్యకు పక్కా ప్రణాళిక సిద్ధం చేశాడు. ఘటనకు ముందు యాక్టివా స్కూటీని దొంగిలించిన నిందితుడు మిర్యాలగూడకు చేరుకుని మార్గమధ్యంలో పెట్రోల్ క్యాన్ కొనుగోలు చేశాడు. ఈ నెల



5వ తేదీ అర్ధరాత్రి సమయంలో ఇంట్లోకి చొరబడి నిద్రిస్తున్న వారిపై పెట్రోల్ చల్లి నిప్పంటించినట్లు పోలీసులు వెల్లడించారు. అయితే ఆ సమయంలో ధనలక్ష్మి ఇంట్లో లేకపోవడంతో ప్రాణాలతో బయటపడగా, వనం చంద్రమ్మ (48), ఆమె మనవడు నక్కా లక్ష్మణ్ (17), మనవరాలు నక్కా ప్రణతి (15) మంటల్లో సజీవ దహనమయ్యారు. ఘటన అనంతరం పరారైన నిందితుడిని గుర్తించేందు కు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. కాలిపోయిన ఇంటి వెనుక లభ్యమైన బకెట్, సీసీటీవీ ఫుటేజీ లు, సాంకేతిక ఆధారాలు, ప్రయాణ మార్గాల విశ్లేషణ ఆధారంగా నిందితుడిని గుర్తించి అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుంచి స్కూటీ, పెట్రోల్ క్యాన్, బకెట్, కాలిన షర్ట్, హెల్మెట్, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ పర్యవేక్షణలో, డీసీఆర్‌బీ డీఎస్పీ జి. రవి నేతృత్వంలో కేసు దర్యాప్తు సాగింది.

## పులి సంచారం:!

**పోలవరం, జూన్ 22:** గత కొంతకాలంగా అటవీ శాఖ అధికారుల పర్యవేక్షణలో ఉన్న పులి, తాజాగా నది దాటి పోలవరం జిల్లా నుండి ఏలూరు జిల్లా పరిధిలోకి ప్రవేశించిందని. ప్రస్తుతం ఇది సిరివాక పరిసర ప్రాంతాలలో ఉన్నట్లు అటవీ శాఖాధికారులు గుర్తించారని జిల్లా అటవీ శాఖాధికారి సందీప్ రెడ్డి చెప్పారు. ప్రస్తుతం అటవీ శాఖకి చెందిన అధికారులు, సిబ్బంది అందరూ కొరుటూరు ప్రాంతంలోనే రాత్రి బస చేసి పరిస్థితిని నిరంతరం గమనిస్తున్నారన్నారు. పులిని పట్టుకోవడానికి వీలుగా నదీ తీరం వెంబడి వేర్వేరు టీమ్లను ఏర్పాటు చేసి, అవసరమైన బోన్లు, లాజిస్టిక్స్ మరియు వెటర్నరీ బృందాలను సిద్ధంగా ఉంచడం జరిగింది. పులి సమీప ప్రాంతాలకు వచ్చే అవకాశం ఉందా, దాన్ని ట్రాంక్విలైజ్ (ఞతీఖఅనబఅశ్రీఅఓవ) చేసేందుకు ఉన్న అవకాశాలపై వారు శ్రమిస్తున్నారన్నారు. పులి సంచరిస్తున్న ప్రాంతంలో జనవాసాలు ఏవీ లేవని ఈ నేపథ్యంలో ప్రజలు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని ప్రస్తుతం అది పాపికొండలు నేషనల్ పార్క్ పరిధిలోనే ఉంది కాబట్టి ప్రజలు ఆందోళన చెందకూడదని అధికారులు స్పష్టం చేశారు. ఉప ముఖ్యమంత్రి (డిప్యూటీ సీఎం) గారి ఆదేశాల మేరకు, మరియు అటవీ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం జిల్లా స్థాయిలో అలాగే మండల స్థాయిలో యంత్రాంగం అంతా చాలా అప్రమత్తంగా ఉన్నారన్నారు. గ్రామస్తులు ఎవరూ కూడా అక్రమంగా నది పరివాహక ప్రాంతాలలో చేపల వేటకు గానీ, పశువుల మేతకు గానీ వెళ్లకూడదని విజ్ఞప్తి చేశారు. అన్ని శాఖల అధికారులను, ప్రజలను అప్రమత్తం చేసి అటవీ శాఖ సిబ్బంది నిరంతరం పరిస్థితిని సమీక్షిస్తున్నారన్నారు.భద్రతా కారణాల దృష్ట్యా, పేరంటపల్లి శివాలయం వరకు టూరిజం కార్యకలాపాలను ఒక మూడు రోజుల పాటు నియంత్రణలో ఉంచాల్సిందిగా జిల్లా అటవీ శాఖాధికారి గారి నుండి టూరిజం డిపార్ట్మెంట్కు లేఖ పంపడం జరిగిందన్నారు.

# టీటీడీతో పాటు అన్ని దేవాలయాల్లో ప్రక్షాళన

**రెండేళ్లుగా వైదికంగా ముందుకు తీసుకెళ్లు ప్రయత్నం**

**జగన్ పాలనలో ఆయాలను భ్రష్టు పట్టించారు**

**దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి**



**అమరావతి, జూన్ 22 :** దేవాలయాలు సమాజంలో భాగమని, అక్కడి కార్యక్రమాలు ప్రజల్లో భాగమని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. టీటీడీతో పాటు అన్ని దేవాలయాలను ప్రక్షాళన చేయడంతో పాటు వైదికంగా ముందుకు తీసుకెళ్లడమే సీఎం చంద్రబాబు లక్ష్యమని మంత్రి చెప్పారు. ముఖ్యమంత్రి సూచనలు, సలహాలతో అత్యంత పవిత్రమైన ఆలోచనతో ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. ఆధ్యాత్మిక, సనాతన పరిరక్షణ కేంద్రాలుగా అనేక ఆలయాలను తీసుకువచ్చామని తెలిపారు. రెండేళ్ల పాలన గురించి ప్రజలకు ఎప్పటికప్పుడు వివరించాలనేది ముఖ్యమంత్రి అభిమతమని.. దానిలో భాగంగా వరుస కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. దేవాదాయ ధర్మాదాయ శాఖలో రెండు సంవత్సరాల ప్రగతిపై ఆనం మాట్లాడుతూ.. 2019–24 మధ్య రాష్ట్రంలో విచ్ఛిన్నకరమైన వాతావరణం ఉందని విమర్శించారు. దేవాలయాలు సమాజంలో భాగమనే విషయాన్ని నాడు మర్చిపోయారని మండిపడ్డారు. 2024లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రారంభించాలని భావించినప్పుడు అప్పటికే భక్తులు, హిందూ బంధువులు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. రామతీర్థంలో శ్రీరామచంద్రుడి శిరచ్ఛేదం, దుర్గమ్మ క్షేత్రంలో వెండిసింహాలు మాయం, అంతర్వేదిలో రథం దగ్ధం వంటి అనేక సంఘటనలు నాడు జరిగాయని గుర్తుచేశారు. నాడు ఆ ప్రభుత్వం కనీసం పశ్చాత్తాపం కూడా వ్యక్తం చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదాయం తక్కువ ఉన్న ఆలయాల్లో దీపం వెలిగించే పరిస్థితి నాడు లేదని.. దీంతో ఆయా ఆలయాల జీర్ణోద్ధరణకు ప్రతినెలా పదివేల రూపాయలు ఇస్తున్నట్లు చెప్పారు. 692 ఆలయాల్లో పనులను ప్రారంభించామని.. కామన్ గుడ్ ఫండ్ నుంచి నిధులు సమకూర్చుతున్నామని చెప్పారు. టీటీడీ సౌలభ్యంతో రాష్ట్ర దేవాదాయ శాఖ ద్వారా భజన మందిరాలు నిర్మాణం చేయాలని నిర్ణయించామన్నారు. దేవాదాయ శాఖలో డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ తీసుకువచ్చామని మంత్రి తెలిపారు. మన మిత్రా వాట్సాప్ గ్రూప్ ద్వారా అనేక సేవలు దర్శనం, ప్రసాదాలు, వసతి కల్పన చేస్తున్నామన్నారు. అంతా ఆన్‌లైన్‌లో ఏర్పాటు చేయడంతో భగవంతుడి పేరుతో చేసే మోసాలను చాలా వరకూ తగ్గించగలిగామని చెప్పారు. డిజిటల్ వ్యవస్థతో దేవాలయ సేవల పట్ల ప్రజలకు నమ్మకం మరింత పెరిగిందన్నారు. ప్రభుత్వం వచ్చాక 970 ధర్మకర్తల మండలిలను నియమించామని తెలిపారు. 449 ఆలయాలకు పాలకమండలిని నియమించాలన్నారు. రాబోయే రోజుల్లో 65 ఆలయాల్లో అన్నప్రసాద వితరణకు చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు చెప్పారని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు. ఇంద్రకీలాద్రి దేవాలయంలో నకిలీ టికెట్ల వ్యవహారంపై అంశంపై సమగ్ర విచారణకు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. గతంలో సమర్పించిన నివేదికలు పూర్తిస్థాయిలో లేవని భావిస్తున్నామని, అందుకే కొత్తగా విచారణ చేపట్టాలని నిర్ణయించామని స్పష్టం చేశారు. తప్పు చేసిన అధికారులు, బాధ్యులు ఎవరైనా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. జగన్ హయాంలో ఆలయాల్లో జరిగిన అక్రమాలు, పరిపాలనా లోపాలపై కూడా సమగ్రంగా పరిశీలిస్తున్నామని అన్నారు. గతంలో నివేదికలు సమర్పించిన అధికారుల పాత్రపైనా విచారణ చేస్తామని పేర్కొన్నారు. దేవాదాయ శాఖకు చెందిన భూముల పరిరక్షణపై తమ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు మంత్రి ఆనం స్పష్టం చేశారు. గతంలో జమిందారులు, ఇనాందారులు ఆలయాల నిర్వహణ కోసం భూములను కేటాయించేవారని, ప్రస్తుతం అలాంటి ఇనాం భూములు వేల ఎకరాల మేర ఉన్నాయని తెలిపారు. జగన్ హయాంలో నిర్లక్ష్యం కారణంగా ఆలయాల ఆస్తులు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిన సందర్భాలు ఉన్నాయని మంత్రి ఆనం ఆరోపించారు. ప్రస్తుతం అలాంటి భూములను తిరిగి స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు కొనసాగుతున్నాయని చెప్పుకొచ్చారు. దేవాదాయ శాఖ రికార్డుల ప్రకారం లక్షల ఎకరాల ఆస్తులు గుర్తించామని, భూముల వివాదాలకు సంబంధించిన సుమారు 2 వేల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు.



## ఫిలిప్పీన్స్‌లో కాల్పుల కలకలం

**స్కూల్లో కాల్పులకు తెగించిన సాయుధులు**

**ముగ్గురు విద్యార్థులు అక్కడికక్కడే మృతి**

**న్యూఢిల్లీ, జూన్ 22 :** ఫిలిప్పీన్స్‌లో దారుణం జరిగింది. టాక్లోబన్‌లోని శాన్ హోసే నేషనల్ హైస్కూల్‌లో కాల్పుల ఘటన తీవ్ర కలకలం సృష్టించింది. ఇద్దరు సాయుధులు అక్రమంగా పాఠశాల ఆవరణలోకి ప్రవేశించి విద్యార్థులపై విచక్షణా రహితంగా తుపాకులతో కాల్పులకు తెగబడ్డారు. ఈ దాడిలో ముగ్గురు విద్యార్థులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా.. మరో ఐదుగురికి తీవ్రమైన బబుల్లెట్ గాయాలు అయ్యాయి. ఫిలిప్పీన్స్‌లో కొద్దికాలంగా అక్రమ ఆయుధాల చలామణి పెరిగిపోయింది. దీంతో ఇటీవల తుపాకీ సంబంధిత నేరాలు సర్వసాధారణం అయిపోయాయి. అయితే, పాఠశాలల్లో కాల్పులకు తెగబడటం చాలా అరుదైన ఘటనని స్థానిక మీడియా, అధికారులు చెబుతున్నారు. ఈ పాఠశాలలో మొత్తం 1,500మంది విద్యార్థులు ఉండగా.. కాల్పుల ఘటనతో పాఠశాల సిబ్బంది సహా వారంతా బయటకు పరుగులు తీశారు. పాఠశాల యాజమాన్యం ఇచ్చిన సమాచారంతో పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి దాడికి ఉపయోగించిన తుపాకులను స్వాధీనం చేసుకున్నారు. అయితే, నిందితుల్లో ఒకరిని అదే పాఠశాలకు చెందిన విద్యార్థిగా పోలీసులు గుర్తించారు. మరోవైపు దాడిలో గాయపడిన ఐదుగురిని సమీప ఆస్పత్రులకు తరలించారు. ఈ ఘటనతో స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ఈ మేరకు పాఠశాల చుట్టుపక్కల ప్రాంతమంతా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మరోవైపు ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. కాల్పులకు గల కారణాలపై ఆరా తీస్తున్నారు.



## చిత్తూరు జిల్లాలో దారుణ ఘటన

**ఒకే కుటుంబానికి చెందిన నలుగురు బలవన్మరణం**

**చిత్తూరు, జూన్ 22 :** చిత్తూరు జిల్లాలో దారుణం చోటు చేసుకుంది. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ ఘటన దిగుమసపల్లె పంచాయతీ బంగారెడ్డిల్లిలో జరిగింది. దామోదరం(30) అనే వ్యక్తి.. తన భార్య నిర్మల(25), కుమారుడు రాజేష్, కుమార్తె శ్రీవిద్యకు విషమిచ్చి, అనంతరం తానూ ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్యకు బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో కొన్ని రోజులుగా సీఎంసీ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. భార్య ఆరోగ్య పరిస్థితి బాగోలేకపోవడం, ఆర్థిక పరిస్థితులు అంతంతమాత్రంగానే ఉండటంతో దామోదరం ఈ దారుణానికి ఒడిగట్టినట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న బీఎన్ఆర్ పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దామోదర్.. సూసైడ్ నోట్‌లో బ్యాంకు ఏటీఎం కార్డు, ఫోన్‌పే పిన్ నెంబర్ రాసిపెట్టాడు. అంత్యక్రియలకు తన ఖాతా నుంచే డబ్బులు వాడుకోవాలని లేఖలో పేర్కొన్నాడు.

## శ్రీచరణ్ అన్ని లిమిట్స్ దాటాడు

**రాధాగాయత్రి చివరి ఫోన్ కాల్ ఆడియో**

**విశాఖపట్నం, జూన్ 22 :** విశాఖకు చెందిన టెకీ రాధాగాయత్రి మృతి కేసు రోజుకో మలుపు తిరుగుతోంది. భర్తతో కలిసి ఉత్తరాఖండ్ వెళ్లిన రాధాగాయత్రి అక్కడి హోమ్‌స్టేలో మృతిచెందిన విషయం తెలిసిందే. మొదట అనుమానాస్పద కేసుగా నమోదు అయినప్పటికీ.. గాయత్రి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు భర్త శ్రీచరణ్‌పై ముస్సోరి పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. తాజాగా రాధాగాయత్రికి చెందిన చివరి ఆడియో వెలుగులోకి వచ్చింది. భర్త ప్రవర్తనపై గాయత్రి తన తల్లితో చెప్పుకుని ఆవేదన వ్యక్తం చేసింది. 'నా మనసు పూర్తిగా విరిగిపోయింది. నా మీద అనుమానం, నా గురించి చెడుగా ప్రచారం చేస్తున్నాడు. నేనేదైనా తప్పు చేస్తే నేరుగా అడగమని మా అత్తయ్యతో అన్నాను. నేను ఇక నా భర్తతో మాట్లాడదలుచుకోవడం లేదు. ఏదైనా ఉంటే మా అమ్మవాళ్లతో మాట్లాడమని చెప్పా. ఇన్నాళ్లు ఓపిక పట్టాను. నా భర్త అన్ని లిమిట్స్ క్రాస్ అయిపోయాడు' అని ఫోన్‌లో రాధాగాయత్రి చెబుతున్నట్లు ఆడియోలో ఉంది. తల్లితో గాయత్రి ఫోన్ సంభాషణ ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

## బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ రాజీనామా

**బ్రిటన్ :** బ్రిటన్‌లో మరోసారి రాజకీయ అస్థిరత నెలకొంది. ఆ దేశ ప్రధాని కీర్ స్టార్మర్ తన పదవికి రాజీనామా చేశారు. లేబర్ పార్టీ ఒత్తిడి వల్లే ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని పేర్కొన్నారు. పదవిలో ఉన్నంత కాలం విలువలకు కట్టుబడి పని చేసినట్లు తెలిపారు. తాజా పరిణామంతో బ్రిటన్‌లో దశాబ్ద కాలంలో తమ పదవులకు రాజీనామా చేసిన ప్రధానుల సంఖ్య ఆరుకి చేరింది. కీర్ స్టార్మర్ 2024లో బ్రిటన్ ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. స్థానిక ఎన్నికల్లో లేబర్ పార్టీ పేలవమైన ప్రదర్శన మాత్రమే ఇవ్వడం, మేకర్‌ఫీల్డ్ పార్లమెంటరీ ఉపఎన్నికలో బర్న్‌హామ్ ఘన విజయం సాధించడంతో స్టార్మర్ నాయకత్వంపై ప్రశ్నలు వస్తున్నాయి. ఎప్‌స్టీన్ కుంభకోణంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న తన స్నేహితుడు పీటర్ మాండెల్సన్‌ను అమెరికాలో యూకే రాయబారిగా నియమించాలనే స్టార్మర్ నిర్ణయంపైనా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ పరిస్థితుల నేపథ్యంలో తాను ప్రధాని పదవి నుంచి వైదొలగాలని సహచర మంత్రులతోపాటు సొంత పార్టీ ఎంపీల నుంచి ఆయనపై ఒత్తిడి పెరిగింది. అయినప్పటికీ తాను పదవి నుంచి వైదొలిగే ప్రసక్తే లేదని వాదిస్తూ వచ్చిన స్టార్మర్.. తాజాగా రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించడం గమనార్హం. మరోవైపు, బ్రిటన్ ప్రధానిగా కీర్ స్టార్మర్ రాజీనామా చేస్తారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదివారం సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. వలసలు, ఇంధన విధానాల్లో వైఫల్యాలే అందుకు కారణమని తన పోస్టులో ఆయన పేర్కొన్నారు.

## నెత్తురోడిన ఏపీ రోడ్లు

- వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురు మృతి
- ప్రకాశంలో ముగ్గురు, తిరుపతిలో ఇద్దరు మృత్యువాత




**తిరుపతి, జూన్ 22 :** ఏపీలో రోడ్లు నెత్తురోడాయి. వేర్వేను రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు దుర్మరణం చెందారు. ప్రకాశం జిల్లాలో ముగ్గురు, తిరుపతి జిల్లాలో ఇద్దరు మృతి చెందారు. ప్రకాశం జిల్లా సంతమాగులూరు మండలం కామేపల్లి సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది. ఆటోను లారీ ఢీకొన్న ఘటనలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. శావల్యాపురం మండలం వేల్పూరు గ్రామానికి చెందిన 10 మంది నాదెండ్ల మండలం సంకురాత్రిపాడులో జరిగే దశదిన కర్మకు హాజరయ్యేందుకు ఆటోలో బయల్దేరారు. కామేపల్లి రైల్వే అండర్‌పాస్ సమీపానికి వచ్చేసరికి.. గ్రానైట్‌తో వస్తున్న లారీ మలుపు తిరుగుతూ.. ఆటోను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఏడుకొండలు (60), రమణమ్మ (50) అక్కడికక్కడే మృతి చెందారు. గాయపడిన మరో ఏడుగురిని సమీపంలోని వివిధ ఆస్పత్రులకు తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సుబ్బాయమ్మ (70) ప్రాణాలు కోల్పోయారు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇకపోతే తిరుపతి జిల్లా పుల్లంపేట మండలం ఉదుంవారిపల్లి వద్ద సోమవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఓ ఆర్టీసీ బస్సును లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా.. 15 మందికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. ఆదివారం రాత్రి ఓ ఆర్టీసీ బస్సు తిరుపతి నుంచి కడప వెళ్తోంది. మరోవైపు ఓ లారీ ఎర్రగుంట్ల నుంచి చెన్నైకి వెళ్తోంది. ఉదుంవారిపల్లి వద్దకు రాగానే లారీ.. బస్సును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఏడాది వయసు గల చిన్నారి ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. పలువురికి కాళ్లు, చేతులు తెగిపడి రోడ్డు మొత్తం రక్తసిక్తమైంది. కోడూరు రూరల్ సీఐ డి. శ్రీనివాసులు, సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను అంబులెన్సులో రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విరిగిన చేతిని సైతం అంబులెన్స్‌లో ఆస్పత్రికి పంపడం ప్రమాద తీవ్రతకు అద్దం పట్టింది. రాజంపేట నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. అందులో కె. జస్విక (16) అనే బాలిక చికిత్స పొందుతూ మృతి చెందింది. కోడూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## పల్ల శ్రీనివాసరావుతో రాధాగాయత్రి తల్లి భేటీ

- కూతురు మరణంపై వివరణ.. న్యాయం కోసం అభ్యర్థన
- అండగా ఉంటామని టిడిపి అధ్యక్షుడి హామీ

**విశాఖపట్నం, జూన్ 22 :** విశాఖకు చెందిన టెకీ రాధా గాయత్రి మృతి కేసులో న్యాయం కోసం కుటుంబసభ్యులు పోరాడుతున్నారు. సోమవారం ఉదయం టీడీపీ ఎమ్మెల్యే శ్రీనివాస్ రావును గాయత్రి తల్లి సత్యవతి కలిశారు. ఈ సందర్భంగా రాధా గాయత్రి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే ఓదార్చారు. తమకు న్యాయం చేయాలని, కూతురి మృతికి కారణమైన దోషులను శిక్షించాలని తల్లి, బంధువులు కోరారు. ఈ కేసు విషయంపై హోం మంత్రి వంగలపూడి అనితతో పల్లా శ్రీనివాస్ ఫోన్‌లో మాట్లాడారు. రాధా గాయత్రి హత్య కేసుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తరఫున పూర్తి సహాయ సహకారం అందిస్తామని పల్లా తెలిపారు. టెకీ గాయత్రి హత్య ముస్సోరిలో జరగటంతో కేసు తుది విచారణ హక్కు అక్కడి పోలీసులకే ఉంటుందన్నారు. రాధా గాయత్రి కుటుంబానికి అండగా ఉంటామని పల్లా శ్రీనివాస్ రావు హామీ ఇచ్చారు. భర్త శ్రీచరణ్‌తో కలిసి ఉత్తరాఖండ్‌లోని ముస్సోరీకి వెళ్లిన గాయత్రి ఈనెల 14న అక్కడి హోమ్‌స్టేలో మృతిచెందిన విషయం తెలిసిందే. గాయత్రి ముక్కు నుంచి రక్తం వచ్చినట్లు గుర్తించిన ముస్సోరి పోలీసులు తొలుత అనుమానాస్పద కేసుగా నమోదు చేశారు. అయితే గాయత్రి తండ్రి ఫిర్యాదుతో భర్త శ్రీచరణ్‌పై అక్కడి పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. కుటుంబసభ్యులను ఏపీ తెదేపా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కేసు గురించి విన్నప్పుడు చాలా బాధ కలిగిందన్నారు. శ్రీచరణ్ సింహాచలం పరిధిలో ఒక లాడ్జిలో దిగినట్లు బంధువులు చెబుతున్నారు. కేసు నమోదైన వెంటనే ఇక్కడి నుంచి పరారైనట్లు తెలిసింది. ఇప్పటికే ముస్సోరీలో కేసు నమోదు చేశారని పల్లా తెలిపారు. మొదటినుంచి శ్రీచరణ్ సైకోలాగే ప్రవర్తిస్తున్నాడని మృతురాలి తల్లి సత్యవతి కన్నీరుమున్నీరయ్యారు. ఇబ్బందిపెడుతున్నట్లు వారం ముందే గాయత్రి చెప్పింది. మృతి చెందిన రోజు అర్ధరాత్రి దాటాక గాయత్రితో శ్రీచరణ్ సెల్ఫీ పెట్టాడు. ఎప్పుడూ ఏ సెల్ఫీ పెట్టని అతడు.. ఆ రోజు మాత్రం పెట్టాడు. మరుసటిరోజు ఉదయమే గాయత్రి మృతి చెందిందని, విమాన టికెట్ పంపాడని సత్యవతి మీడియాకు తెలిపారు. విజయనగరం జిల్లా మామిడిపల్లికి చెందిన రాధా గాయత్రికి గతేడాది నవంబర్‌లో విశాఖకు చెందిన శ్రీచరణ్‌తో వివాహమైంది. ఇద్దరూ కలిసి ఇటీవల విహారయాత్రకు వెళ్లగా.. ఉత్తరాఖండ్ లోని డెహ్రాడూన్‌లో ఆమె అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంగతి తెలిసిందే.



## భారత్‌కు గుడ్‌న్యూస్

**ఆయుధ సర్వీసులకు అమెరికా అంగీకారం**

**న్యూఢిల్లీ :** భారత్‌కు విక్రయించిన కీలక ఆయుధాలకు సంబంధించి సర్వీస్‌లను అందించేందుకు అమెరికా ప్రభుత్వం అంగీకరించింది. ఈ విషయాన్ని అమెరికా విదేశాంగ శాఖ.. అక్కడి కాంగ్రెస్‌కు వెల్లడించింది. అపాచీ ఎటాక్ హెలికాప్టర్లు, ఎం777ఏ2 అల్ట్రాలైట్ శతఘ్నులకు సంబంధించిన సర్వీసులను అగ్రరాజ్యం అందించనుంది. ఈ డీల్ విలువ 482 మిలియన్ డాలర్లుగా అంచనావేసింది. విదేశాలకు ఆయుధ విక్రయాలను పర్యవేక్షించే ది డిఫెన్స్ సెక్యూరిటీ కోఆపరేషన్ ఏజెన్సీ.. ఇటీవల ఈ సర్వీసులకు సంబంధించిన నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో భారత్ అమ్ములపొదిలోని కీలక ఆయుధాల నిర్వహణ, లాజిస్టిక్స్, శిక్షణ, సాంకేతిక సాయం వంటి వాటికి ఇబ్బంది లేకుండాపోతుంది. అమెరికాలోని బోయింగ్, లాక్‌హీడ్ మార్టిన్ కంపెనీలు అపాచీ సర్వీసు కాంట్రాక్టర్లు కాగా.. బీఏఈ సిస్టమ్స్ ఎం777కు సర్వీసు కాంట్రాక్టులు చేస్తోంది.




## అది ఫేక్ వీడియో : ఎన్‌టీఏ

**న్యూఢిల్లీ :** దేశవ్యాప్తంగా నీట్ రీటెస్ట్ ఆదివారం జరిగింది. ఈ నేపథ్యంలో ప్రశ్నపత్రం లీక్ అయిందంటూ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోన్న ఓ వీడియోపై ఎన్‌టీఏ మరోసారి స్పందించింది. అది నకిలీదని ఎక్స్ వేదికగా వెల్లడించింది. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అలాంటి తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దని విజ్ఞప్తి చేసింది. దేశవ్యాప్తంగా అత్యంత కట్టుదిట్టమైన భద్రత నడుమ రీటెస్ట్ విజయవంతంగా ముగిసిందని ఎన్‌టీఏ వెల్లడించింది. అవాస్తవాలతో కూడిన వీడియోను కొందరు కావాలనే సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారని పేర్కొంది. తప్పుడు సమాచారాన్ని సృష్టించి, విద్యార్థులను ఆందోళనకు గురిచేయడం తీవ్రమైన నేరమని, బాధ్యులపై కఠిన తీసుకుంటామని హెచ్చరించింది. కేవలం అధికారిక వెబ్‌సైట్‌లో వచ్చే సమాచారాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని, తప్పుడు సమాచారాన్ని సోషల్ మీడియాలో షేర్, ఫార్వార్డ్ చేయొద్దని కోరింది. కాగా.. దేశవ్యాప్తంగా నీట్ యూజీ రీ–ఎగ్జామ్‌కు 20 లక్షల మందికిపైగా విద్యార్థులు హాజరయ్యారు. ఢిల్లీలోని ఎన్‌టీఏ ప్రధాన కార్యాలయం నుంచి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ సమీక్షించారు. అన్ని ప్రభుత్వ విభాగాల సహకారంతో పునః పరీక్షను రికార్డు సమయం (37 రోజుల్లో)లో దిగ్విజయంగా నిర్వహించగలిగామని ఎన్‌టీఏ డైరెక్టర్ జనరల్ అభిషేక్ సింగ్ పేర్కొన్నారు. తొలుత మే 3న ఈ ప్రవేశ పరీక్ష జరిగిన సంగతి తెలిసిందే. పేపర్ లీక్ ఆరోపణలతో దాన్ని రద్దు చేయాల్సి వచ్చింది. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇరకాటంలో పడింది. ఆదివారం బెంగళూరులో హస్తం పార్టీ నిర్వహించిన ర్యాలీ కారణంగా ముగ్గురు విద్యార్థులు నీట్ పరీక్ష రాయలేకపోయారని ఆరోపణలు వస్తున్నాయి. ర్యాలీ కారణంగా ట్రాఫిక్ జామ్ అవడంతో పరీక్షాకేంద్రాలకు చేరుకోవడంలో ఇబ్బందిపడ్డామని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. దీంతో ఇప్పుడీ వ్యవహారం భాజపా, కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధానికి దారితీసింది.

## మార్కెట్లోకి ఇక ఇరాన్ చమురు

**స్విట్జర్లాండ్ చర్చల్లో కీలక పురోగతి**

**స్విట్జర్లాండ్ :** తమ చమురు ఎగుమతులపై ఆంక్షలను ఎట్టకేలకు అమెరికా తొలగించినట్లు ఇరాన్ వెల్లడించింది. స్విట్జర్లాండ్‌లో అమెరికాతో జరిగిన తొలి విడత చర్చల అనంతరం ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ 'ఎక్స్' వేదికగా ప్రకటించారు. అమెరికా–ఇరాన్ మధ్య అవగాహన ఒప్పందం అమలు పర్యవేక్షణకు ఓ కమిటీ ఏర్పాటు కానుంది. దీంతోపాటు లెబనాన్‌లో ఉద్రిక్తతలను నివారించేందుకు డీకాన్ఫిలిక్షన్ సెల్ ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు ఇరాన్–అమెరికా అంగీకారానికి రావడంతో తొలివిడత చర్చలు ముగిశాయి. అనంతరం మధ్యవర్తులుగా వ్యవహరించిన పాకిస్థాన్–ఖతార్ ఓ సంయుక్త ప్రకటనను విడుదల చేశాయి. హర్మూజ్ జలసంధిలో ఉద్రిక్తతలను నివారించడానికి అమెరికా–ఇరాన్ మధ్య ఓ కమ్యూనికేషన్ లైన్ కూడా ఏర్పాటు చేయనున్నారు. దీంతో పాటు తరచూ ఉద్రిక్తలకు కారణమవుతున్న లెబనాన్ అంశంపై డికాన్ఫిలక్షన్ సెల్‌ను ఏర్పాటు చేయడానికి అమెరికా అంగీకరించింది. ఇరు దేశాల మధ్య ఉన్నత స్థాయి ప్రతినిధులు తొలివిడత చర్చలు ముగిశాయి. కానీ, సాంకేతిక అంశాలపై ఈ వారం కూడా చర్చలు కొనసాగనున్నాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటనలు చర్చలకు ప్రధాన అవాంతరంగా మారాయి. ఇరాన్ ముసుగు సంస్థ కార్యకలాపాలను ఆపేయాలంటూ ట్రంప్ ట్రూత్ సోషల్‌లో పోస్టు చేశారు. లేకపోతే ఇరాన్‌పై భారీ ఎత్తున దాడి చేస్తామని హెచ్చరించారు. అంతేకాదు.. ఇరాన్ అధ్యక్షుడు మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలంటూ బెదిరించారు. దీంతో ఇరాన్ స్పీకర్ మహమ్మద్ బాఘేర్ దౌత్య బృందం చర్చల నుంచి వాకౌట్ కూడా చేసింది. అమెరికాకు చర్యలకు ప్రతిస్పందించేందుకు తామూ సిద్ధమే అని ఆయన పేర్కొన్నారు.

# ఆధార్ మొబైల్ యాప్‌లో ఈ సదుపాయం 6 నెలలు ఫ్రీ



భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ తన మొబైల్ యాప్‌లో ఇ-మెయిల్ అప్‌డేషన్‌పై రుసుములు తొలగించింది. ప్రస్తుతం ఇ-మెయిల్ ఐడీ అప్‌డేషన్ కోసం రూ.75 చొప్పున ఫీజు వసూలు చేస్తుండగా.. జులై 1 నుంచి ఆరు నెలల పాటు అంటే 2026 డిసెంబర్ 31వరకు ఉచితంగా అప్‌డేట్ చేసుకునే సదుపాయాన్ని ఉడాయ్ కల్పిస్తోంది. మీ ఇ-మెయిల్‌ను అప్‌డేట్ చేసుకోవడం ద్వారా ముఖ్యమైన సమాచారం ఎప్పటికప్పుడు అందుకోవచ్చు. ఆధార్‌కు సంబంధించిన సేవలను సులభతరం చేయడంలో భాగంగా కొన్ని రోజుల క్రితం ఉడాయ్ ఆధార్ మొబైల్ యాప్‌ను లాంచ్ చేసిన సంగతి తెలిసిందే. ఆండ్రాయిడ్, ఐఓఎస్ యూజర్లకు అందుబాటులో ఉన్న ఈ యాప్‌లో ప్రస్తుతం మొబైల్ నంబర్, అడ్రస్ అప్‌డేట్, బయోమెట్రిక్ లాక్/ అన్‌లాక్, ఆధార్ వివరాలు సెలక్టివ్ షేరింగ్, అథంటికేషన్ హిస్టరీ, ఇ-ఆధార్ డౌన్‌లోడ్ వంటి తదితర సేవలు లభిస్తున్నాయి. ఆధార్ నంబర్‌కు ఇ-మెయిల్ ఐడీని ఎక్కువ మంది అనుసంధానం చేసుకునేలా ప్రోత్సహించడంలో భాగంగా ఈ ఏడాది చివరి వరకు మొబైల్ యాప్ ద్వారా ఈ సదుపాయాన్ని ఉచితంగా అందించనున్నారు. ఆ తర్వాత రుసుముల గురించి సమీక్షించి తదుపరి నిర్ణయం తీసుకోనున్నారు. మొబైల్ యాప్ కాకుండా ఇతర మార్గాల్లో అప్‌డేట్ చేసినప్పుడు రుసుములు వర్తిస్తాయి.






## 1,000 మంది ఉద్యోగులను తీసేసి..
## 50 రోబోలను పెట్టుకొని..

పలు రంగాల్లో ఉపాధి అవకాశాలపై కృత్రిమ మేధ, రోబోటిక్స్ గణనీయమైన ప్రభావాన్ని చూపిస్తున్నాయి. దేశీయ, ప్రపంచస్థాయి కంపెనీల్లో లేఆఫ్‌లకు ఏఐ టూల్స్, రోబోలు ప్రధాన కారణంగా మారుతున్నాయి. తాజాగా అమెరికాకు చెందిన ఆటోమొబైల్ దిగ్గజం జనరల్ మోటార్స్ 1000కిపైగా ఉద్యోగాలను తొలగించింది. ఆ స్థానాలను రోబోలతో భర్తీ చేసింది. ఈ మార్పు తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. మిషిగన్‌లోని తన కేంద్రకార్యాలయంలో కొలాబరేటివ్ రోబోట్స్ (కోబోట్స్)ను జనరల్ మోటార్స్ విధుల్లోకి తీసుకువచ్చింది. వాహనాల అసెంబ్లింగ్‌లో మిగతా ఉద్యోగులతో కలిసి కోబోట్స్ పనిచేస్తున్నాయి. తమ కార్యకలాపాల్లోకి అధునాతన సాంకేతికతను చొప్పించే ప్రయత్నాల్లో భాగంగా ఈ రోబోలను తీసుకొచ్చామని కంపెనీ ప్రతినిధి కెవిన్ కెల్లీ వెల్లడించారు. అన్ని భద్రతా నియమాలను పాటిస్తూనే, తమ ఉత్పత్తులు పోటీని తట్టుకునేలా చూసుకునేందుకు ఈ నిర్ణయాలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అయితే జనరల్ మోటార్స్ నిర్ణయంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మెషిన్లు తమ ఉద్యోగాలను లాగేసుకుంటున్నాయని ట్రేడ్ యూనియన్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. "వెయ్యి ఉద్యోగాలుపోయాయి.. ఇప్పుడు రోబోలు వచ్చాయి. ఇదే భవిష్యత్తు అంటున్నారు. ఇదే కొనసాగితే.. ప్రజలకు ఉద్యోగాలు ఉండవు" అని యూనియన్ ప్రతినిధులు వాపోయారు.



## తనయ్ కెప్టెన్ ఇన్నింగ్స్..
### నల్గొండపై రంగారెడ్డి రైజర్స్ విజయం

**హైదరాబాద్:** టీజీ20 లీగ్ 2026లో భాగంగా నల్గొండ నైట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో రంగారెడ్డి రైజర్స్ 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన నల్గొండ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 189 పరుగులు చేసింది. ఈ టార్గెట్‌ని రంగారెడ్డి జట్టు 16.3 ఓవర్లలోనే 5 వికెట్లు కోల్పోయి పూర్తి చేసింది. తనయ్ త్యాగరాజన్ (71; 30 బంతుల్లో) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో జట్టును గెలిపించాడు. ఆదిత్య జవ్వాజి (41; 32 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సులు), అవినాష్ రావు (22; 6 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్సులు), నితిన్ సాయి యాదవ్ (26; 9 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సులు) రాణించారు. నల్గొండ బౌలర్లలో అనికేత్ రెడ్డి 2, వరుణ్ గౌడ్ 2, నిశాంత్ ఒక వికెట్ తీశారు. అంతకుముందు నల్గొండ బ్యాటర్లలో ఆరో స్థానంలో వచ్చిన దివేశ్ సింగ్ (48; 27 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. చివర్లో హర్షవర్ధన్ సింగ్ (40; 20 బంతుల్లో) మెరుపులు మెరిపించాడు. కెప్టెన్ రాహుల్ బుద్ధి (30), వరుణ్ గౌడ్ (26), పాట్కూరి నితీశ్ రెడ్డి (20) పరుగులు చేశారు. ఓపెనర్లు గౌరవ్ రెడ్డి (0), ప్రణవ్ సూర్యదేవర (7)తోపాటు అర్ఫాన్ అహ్మద్ (7) నిరాశపర్చారు. రంగారెడ్డి బౌలర్లలో పున్నయ్య 3, నితిన్ సాయి యాదవ్ 2, ఆర్యన్ చరియప్ప 2, తనయ్ త్యాగరాజన్ ఒక్కో వికెట్ పడగొట్టారు.

# కోహ్లీ టెస్టుల్లోకి రీఎంట్రీ ఇస్తాడా..?



స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ తన టెస్ట్ క్రికెట్ రీఎంట్రీ వార్తలకు పూర్తిగా తెరదించాడు. తన వన్8 బ్రాండ్ షూ లాంచ్ ఈవెంట్‌లో హోస్ట్ అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ.. టెస్ట్ క్రికెట్‌తో తన పని అయిపోయిందని స్పష్టం చేశాడు. కోహ్లీ తన టెస్ట్ కెరీర్‌లో చేసిన మొత్తం పరుగులు 9,230 కాగా, దానికి గుర్తుగా కొత్త షూ ధరను కూడా రూ. 9,230 గానే నిర్ణయించడం విశేషం. ప్రస్తుతం కోహ్లీ దృష్టి కేవలం వన్డే ఫార్మాట్ పైనే ఉంది. విరాట్ కోహ్లీ .. ప్రపంచ క్రికెట్‌లో పరిచయం అక్కర్లేని పేరు. ఎన్నో రికార్డులు అతడి సొంతం. ఛేజ్ మాస్టర్‌గా పేరుపొందిన విరాట్ కోహ్లీ.. భారత్‌కు ఎన్నో అపురూప విజయాలు అందించాడు. ప్రపంచ క్రికెట్‌లో రికార్డులు బద్దలు కొట్టాడు. అయితే ప్రస్తుతం కోహ్లీ అంతర్జాతీయ క్రికెట్ కెరీర్ ముగింపు దశకు వచ్చింది. ఇప్పటికే టీ20, టెస్టులకు గుడ్ బై చెప్పేశాడు కోహ్లీ. కేవలం వన్డేలు మాత్రమే ఆడుతున్నాడు. వచ్చే ఏడాది జరిగే వన్డే ప్రపంచకప్ 2027 కోహ్లీ కెరీర్‌లో చివరి ఈవెంట్ అయ్యే అవకాశం ఉందనే అంచనాలు ఉన్నాయి. అయితే ఇటీవల కొన్ని వార్తలు సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొడుతున్నాయి. టెస్ట్ క్రికెట్‌కే ప్రత్యేక గుర్తింపు తెచ్చిన కింగ్.. రిటైర్మెంట్ వెనక్కి తీసుకుని మళ్లీ రీఎంట్రీ ఇస్తాడనే వార్తలు వస్తున్నాయి. అభిమానులు కూడా ఈ వార్తలు నిజం కావాలని కోరుకుంటున్నారు. అతడిలో ఇంకా క్రికెట్ ఉందని.. టెస్ట్ క్రికెట్‌కు అతడి అవసరం ఉందని పేర్కొంటున్నారు. అయితే ఇదే విషయంపై ఇటీవల ఓ కార్యక్రమంలో పాల్గొన్న కోహ్లీకి ప్రశ్న ఎదురైంది. దీనికి అతడు తనదైన శైలిలో సమాధానమిచ్చాడు. ఇటీవల కోహ్లీ స్పోర్ట్స్ బ్రాడ్ వన్8 లాంచ్ ఈవెంట్‌లో పాల్గొన్నాడు. ఈ బ్రాండ్‌లో ఓ షూ ధర రూ. 9,230గా ఉంది. టెస్ట్ క్రికెట్‌లో కోహ్లీ సాధించిన పరుగులు సైతం 9,230 కావడం గమనార్హం. ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ హోస్ట్.. కోహ్లీని ఉద్దేశించి ఓ ప్రశ్న అడిగాడు. "విరాట్ మీరు ఇంకొన్ని రన్స్ చేసి.. ఆ షూ లాభాలు పెంచొచ్చు కదా?" అని అడిగాడు. దీనికి కోహ్లీ "నేను తక్కువ ధరకే అమ్మేయడానికి ఇష్టపడతా. మీరు ఏదైతే అడుగుతున్నారో దానితో.. (టెస్ట్ క్రికెట్‌ను ఉద్దేశిస్తూ.. ) నా పని అయిపోయింది. థాంక్యూ" అని విరాట్ కోహ్లీ సమాధానమిచ్చాడు. కోహ్లీ సమాధానంతో అతడు మళ్లీ టెస్ట్ క్రికెట్‌లో ఆడబోడనే విషయం స్పష్టమైంది. కోహ్లీ.. త్వరలో ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్‌లో బరిలోకి దిగే అవకాశం ఉంది.



## ఏఐ జోరుతో భారత్‌లో డేటా సెంటర్ల వృద్ధి: గోల్డ్‌మన్ శాక్స్

ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న డేటా సెంటర్ల మార్కెట్లలో ఒకటిగా భారత్ నిలిచింది. ఆసియాలో భారత్, జపాన్, ఫిలిప్పీన్స్ అగ్రగామి వృద్ధి మార్కెట్లుగా అవతరించినట్లు గోల్డ్‌మన్ శాక్స్ నివేదిక వెల్లడించింది. ఏఐ, క్లౌడ్, డేటా స్థానికీకరణ నిబంధనల కారణంగా భారత్‌లో డేటా సెంటర్ల రంగంలో అనూహ్యమైన వృద్ధి కనిపిస్తోందని పేర్కొంది. డిజిటల్ ఆర్థిక వ్యవస్థ వృద్ధి, కృత్రిమ మేధస్సు, అనువైన భౌగోళిక పరిస్థితులు, భారీగా ఇంజినీరింగ్ టాలెంట్, పశ్చిమాసియాకు సమీపంలో ఉండటం వంటి వాటివల్ల ఈ రంగం శరవేగంగా విస్తరిస్తోందని తెలిపింది. దేశంలో ముంబయి, చెన్నై నగరాలు ప్రధాన డేటా సెంటర్ కేంద్రాలుగా ఉండగా.. ఆ తర్వాత స్థానాల్లో దిల్లీ-ఎన్‌సీఆర్, బెంగళూరు ఉన్నాయి. సముద్రగర్భంలో ఉండే కేబుల్ ల్యాండింగ్ స్టేషన్లు ఈ నగరాలకు అనుకూలంగా మారాయి. ఏఐ వేగంగా విస్తరిస్తుండడం వల్ల డేటా సెంటర్లను డిజైన్ చేసే, విక్రయించే విధానాలు ప్రాథమికంగా మారుతున్నాయని నివేదిక పేర్కొంది. సాంకేతికత కస్టమర్ల కాలపరిమితులను, మౌలిక సదుపాయాల అవసరాలను ప్రాథమికంగా మారుస్తోందని తెలిపింది. ఇటీవల వెలువడిన నైట్ ఫ్రాంక్ ఇండియా నివేదిక ప్రకారం దేశంలో డేటా సెంటర్ల సామర్థ్యం 2025 చివరి నాటికి 1.6 గిగావాట్లను దాటింది. ప్రస్తుతం 0.32 గిగావాట్ల డేటా సెంటర్ సామర్థ్యం నిర్మాణ దశలో ఉండగా.. మరో 2.92 గిగావాట్ల ఒప్పందంపై చర్చలు జరుగుతున్నాయని ఆ నివేదిక పేర్కొంది.




## 12 ఓవర్లకు 12 పాయింట్లు కోత..
### ఇంగ్లాండ్‌కు ఐసీసీ భారీ షాక్

న్యూజిలాండ్‌తో మూడు టెస్టుల సిరీస్‌లో ఇంగ్లాండ్ 1-1తో సమంగా ఉంది. మొదటి మ్యాచ్‌లో ఇంగ్లాండ్ గెలవగా.. రెండో మ్యాచ్‌లో కివీస్ 253 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. రెండో టెస్టుకు రెగ్యులర్ సారథి బెన్ స్టోక్స్ దూరం కాగా.. ఘోర పరాజయం చవిచూసింది. ఈ క్రమంలో ఇంగ్లాండ్‌కు ఐసీసీ గట్టి షాక్ ఇచ్చింది. ఈ జట్టుకు పాయింట్లను తగ్గించింది. ఇప్పటికే పర్సంటేజీ తగ్గగా.. పాయింట్లలోనూ భారీగా కోత పడటంతో డబ్ల్యూటీసీ ఫైనల్ ఆశలు మరింత సంక్లిష్టంగా మారాయి. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో ఇంగ్లాండ్ ఏడో స్థానంలో ఉంది. ఆదివారం న్యూజిలాండ్‌తో రెండో టెస్టులో ఇంగ్లాండ్ ఓడిపోయింది. దీంతో డబ్ల్యూటీసీ పట్టికలో ఈ జట్టు పర్సంటేజీ 34.72 నుంచి 26.38 శాతానికి పడిపోయింది. రెండో టెస్టు మ్యాచ్‌కు ముందు ఇంగ్లాండ్ ఖాతాలో 50 పాయింట్లు ఉన్నాయి. కానీ, ఈ టెస్టులో ఏకంగా 12 ఓవర్లను ఆలస్యంగా వేయడంతో 12 పాయింట్లను కోల్పోవాల్సి వచ్చింది. దీంతో పాయింట్ల సంఖ్య 50 నుంచి 38కి తగ్గింది. కెప్టెన్‌గా వ్యవహరించిన జో రూట్‌తోపాటు సహచరులందరికీ మ్యాచ్ ఫీజులో 50 శాతం జరిమానాగా పడింది. స్వదేశంలో సిరీస్‌ను సొంతం చేసుకోవాలనే లక్ష్యంతో ఉన్న ఇంగ్లాండ్‌కు ఓ గుడ్‌న్యూస్. బాక్సర్‌తో గొడవ కారణంగా రెండో టెస్టు ఆడలేకపోయిన కెప్టెన్ బెన్ స్టోక్స్ మళ్లీ జట్టులోకి వచ్చాడు. కివీస్‌తో మూడో టెస్టు కోసం ప్రకటించిన స్క్వాడ్‌లో అతడికి చోటు దక్కింది. కెప్టెన్ రాకతో తుది జట్టులో ఎవరిని పక్కన పెడతారో చూడాలి. జూన్ 25 నుంచి నాటింగ్‌హామ్ వేదికగా మూడోటెస్టు ప్రారంభం కానుంది.

# ఓడినా భారత్‌కు ఛాన్స్..!



మహిళల టీ20 ప్రపంచకప్ 2026లో దక్షిణాఫ్రికా చేతిలో ఓడినప్పటికీ, భారత్ ం2.511 అత్యుత్తమ నెట్ రన్ రేట్‌తో గ్రూప్-ఏ పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో కొనసాగుతోంది. అయితే సెమీస్ చేరాలంటే జూన్ 25న బంగ్లాదేశ్, జూన్ 28న ఆస్ట్రేలియాతో జరిగే తదుపరి రెండు మ్యాచ్‌లలో భారత్ తప్పక గెలవాలి. ఒకవేళ భారత్ ఒక మ్యాచ్ ఓడిపోతే, సెమీస్ అవకాశాలు సంక్లిష్టం అవుతాయి. అప్పుడు దక్షిణాఫ్రికా మ్యాచ్ ఫలితాలపై టీమిండియా సెమీస్ అవకాశాలు ఆధారపడి ఉంటాయి. మహిళల టీ20 ప్రపంచకప్ 2026లో భారత జట్టుకు షాక్ తగిలింది. ఉత్కంఠ భరితంగా సాగిన మ్యాచులో దక్షిణాఫ్రికా.. భారత్‌పై విజయం సాధించింది. తాజా విజయంతో సౌతాఫ్రికా తమ సెమీస్ అవకాశాలను సజీవంగా ఉంచుకుంది. కానీ ఈ మ్యాచ్ ఫలితంతో టీమిండియా సెమీస్ అవకాశాలు సంక్లిష్టంగా మారాయి. అయితే ప్రస్తుతం జరుగుతున్న ఈ టోర్నీలో భారత్, సౌతాఫ్రికా గ్రూప్-ఏలో ఉన్నాయి. పాయింట్స్ టేబుల్‌లో ఇప్పుడు ఆస్ట్రేలియా అగ్రస్థానంలో ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో భారత్, సౌతాఫ్రికాల్లో కేవలం ఒక్క జట్టు మాత్రమే సెమీస్ చేరే అవకాశం ఉంది. భారత్ ఈ టోర్నీలో మిగిలిన లీగ్ స్టేజ్‌లో జూన్ 25న బంగ్లాదేశ్, జూన్ 28న ఆస్ట్రేలియాతో తలపడనుంది. సౌతాఫ్రికా చేతిలో ఓడినా.. టీమిండియా నెట్ రన్ రేట్ మెరుగ్గా ఉంది. దీంతో దక్షిణాఫ్రికాతో సమానంగా పాయింట్లు ఉన్నప్పటికీ టేబుల్‌లో భారత్ ఇప్పటికే రెండో ప్లేసులో ఉంది. ఇక టీమిండియా సెమీస్ చేరాలంటే మిగిలిన రెండు మ్యాచులలో తప్పకుండా గెలవాల్సి ఉంది. ప్రస్తుతం టీమిండియా నెట్ రన్ రేట్ 2.511, దక్షిణాఫ్రికా నెట్ రన్ రేట్ కంటే -0.546 మెరుగ్గా ఉంది. ఒకవేళ టీమిండియా తన తదుపరి రెండు మ్యాచులలో ఒకదాంట్లో ఓడిపోతే.. సెమీస్ అవకాశాలు దక్షిణాఫ్రికా మ్యాచ్ ఫలితాలపై ఆధారపడి ఉంటాయి. దక్షిణాఫ్రికా మిగిలిన రెండు మ్యాచులలో బంగ్లాదేశ్, నెదర్లాండ్స్‌తో తలపడనుంది. ఇందులో ఒక దాంట్లో ఆ జట్టు ఓడిపోతే భారత్ ముందంజ వేసే అవకాశం ఉంది. అలా కాకుండా భారత్.. ఆసీస్ చేతిలో ఓడిపోయి.. ప్రొటీస్ జట్టు రెండింట్లోనూ గెలిస్తే.. టీమిండియా టోర్నీ నుంచి నిష్క్రమిస్తుంది. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా సెమీస్‌కు చేరుకుంటాయి. ఇక గ్రూప్-ఏ నుంచి పాకిస్థాన్, నెదర్లాండ్స్ ఇప్పటికే టోర్నీ నుంచి నిష్క్రమించాయి. ఆ రెండు జట్లూ ఆడిన మూడు మ్యాచులలోనూ ఓడిపోయాయి. ప్రస్తుతం గ్రూప్-ఏలో ఆస్ట్రేలియా 3 మ్యాచులలో 3 విజయాలు, ం4.391 నెట్ రన్ రేట్‌తో టేబుల్ టాపర్‌గా ఉంది.




## లాభాల్లో ముగిసిన సూచీలు..

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయంగా ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడం, చమురు ధరలు బ్యారెల్ 80 డాలర్ల దిగువన కొనసాగుతుండడం స్టాక్ మార్కెట్‌లో మరోసారి కొనుగోళ్ల మద్దతు కనిపించింది. ముఖ్యంగా ఐటీ, ఫార్మా స్టాక్స్‌లో కొనుగోళ్లు కలిసొచ్చాయి. సెన్సెక్స్ ఉదయం 77,160.67 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 76,802.90) లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 77,325.56 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 291.17 పాయింట్ల లాభంతో 77,094.07 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 89.80 పాయింట్ల లాభంతో 24,102.90 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 94.70గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టెక్ మహీంద్రా, సన్‌ఫార్మా, రిలయన్స్, ఇన్ఫోసిస్, బీఈఎల్ షేర్లు లాభపడ్డాయి. ఏషియన్ పెయింట్స్, టైటాన్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ట్రెంట్, ఐటీసీ షేర్లు నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 79.17 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4210 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.



# బాలకృష్ణ- కొరటాల కాంబో

## 25న షూటింగ్ ప్రారంభానికి ముహూర్తం

బాలకృష్ణ కథానాయకుడిగా కొరటాల శివ దర్శకత్వంలో ఓ సినిమా రానున్న విషయం తెలిసిందే. 'ఎన్‌బికె 112'గా ప్రచారంలో ఉంది. ఈ సినిమా షూటింగ్ త్వరలో ప్రారంభం కానుంది. తాజాగా ఆ వివరాలను చిత్రబృందం పంచుకుంది. జూన్ 25న వెంకటపాలెంలోని వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఈ సినిమా ప్రారంభోత్సవం జరగనుంది. ముఖ్య అతిథులుగా మంత్రులు నారా లోకేశ్, కందుల దుర్గేశ్ హాజరు కానున్నారు. మే నెలలో ఈ ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటించారు. 'అధికారానికి ఉద్దేశం తోడైతే.. అది ఉద్యమంగా మారుతుంది' అనే పవర్‌ఫుల్ కొటేషన్‌తో టీమ్ దీనిపై అంచనాలు పెంచేసింది. కొరటాల శివ మార్కు సామాజిక సందేశంతో పక్కా మాస్ యాక్షన్ ఎంటర్ టైనర్‌గా ఈ సినిమా ఉ ఒడనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం బాలయ్య.. గోపీచంద్ మలినేని దర్శకత్వంలో ఓ సినిమాలో నటిస్తున్నారు. 'వీరసింహారెడ్డి' తర్వాత బాలకృష్ణ – గోపీచంద్ మలినేని దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రమిది. కాజల్ కథానాయికగా నటిస్తుండగా.. మంచు మనోజ్ ఓ కీలక పాత్రని పోషిస్తున్నారు. ఈ రెండు సినిమాలను బాలకృష్ణ ఒకేసారి పూర్తి చేయనున్నట్లు వార్తలు వస్తున్నాయి.







# సంయుక్తా మీనన్ ది బ్లాక్ గోల్డ్

మోస్ట్ బ్యూటిఫుల్ నటి సంయుక్తా మీనన్ ప్రస్తుతం 'ది బ్లాక్ గోల్డ్' చిత్రంలో ప్రధాన పాత్రలో నటిస్తోంది. ఇప్పటివరకు క్లాస్, డీసెంట్ పాత్రలతో పాటు గ్లామర్ రోల్స్‌లో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ భామ, ఈ సినిమాలో పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనుంది. దీంతో ఈ సినిమాపై ప్రేక్షకుల్లో మంచి అంచనాలు ఏర్పడ్డాయి. మొదట ఈ చిత్రాన్ని ఈ ఏడాది సమ్మర్‌లో విడుదల చేయనున్నట్లు వార్తలు వచ్చినప్పటికీ, సినిమా సమ్మర్ రేస్ నుంచి తప్పుకుంది. తాజాగా ఈ మూవీ విడుదల తేదీకి సంబంధించి ఓ క్రేజీ న్యూస్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ చిత్రాన్ని ఆగస్టు 14న విడుదల చేయాలని మేకర్స్ భావిస్తున్నట్లు, అందుకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన కూడా త్వరలోనే వెలువడే అవకాశం ఉందని తెలుస్తోంది. ఒకవేళ ఆగస్టు 14న సినిమా విడుదలైతే బాక్సాఫీస్ వద్ద గట్టి పోటీని ఎదుర్కొనే అవకాశాలు ఉన్నాయని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. యోగేశ్ కెఎంసీ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో మురళీ శర్మ, రావు రమేష్, నాజర్, మనీష్ వాధ్వా తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. శ్యామ్ సీఎస్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని హాస్య మూవీస్, మాగంటి పిక్చర్స్ బ్యానర్లపై రాజేశ్ దండా నిర్మిస్తున్నారు.



# అందాలతో అలరిస్తున్న ఆషికా రంగనాథ్

అందం, అభినయంతో తక్కువ సమయంలోనే మంచి గుర్తింపును సంపాదించుకుంది ఆషికా రంగనాథ్. వరుస అవకాశాలతో కెరీర్‌ను ముందుకు తీసుకెళ్లిన ఈ బ్యూటీ, 2023లో కళ్యాణ్ రామ్ హీరోగా తెరకెక్కిన 'అమిగోస్' చిత్రంతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. అనంతరం 'నా సామి రంగ' సినిమాతో తెలుగు ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణను అందుకుని తన ఖాతాలో తొలి విజయాన్ని నమోదు చేసుకుంది. ప్రస్తుతం మెగాస్టార్ చిరంజీవి హీరోగా తెరకెక్కుతున్న 'విశ్వంభర' చిత్రంలో కీలక పాత్రలో నటిస్తోంది. సినిమాలతో పాటు సోషల్ మీడియాలోనూ ఆషికా రంగనాథ్ ఎంతో యాక్టివ్‌గా ఉంటుంది. తరచూ తనకు సంబంధించిన గ్లామరస్ ఫోటోషూట్లను అభిమానులతో పంచుకుంటూ నెట్టింట సందడి చేస్తుంటుంది. తాజాగా ఈ భామ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో కొన్ని అందమైన ఫోటోలను షేర్ చేసింది. ఆ ఫోటోల్లో గోల్డ్ అంచు కలిగిన రెడ్ కలర్ శారీని ధరించిన ఆషికా, హెవీ ఎంబ్రాయిడరీ వర్క్‌తో డిజైన్ చేసిన గోల్డ్ కలర్ బ్లౌజ్‌లో ఎంతో ఆకర్షణీయంగా కనిపించింది. మెడలో భారీ హారం, చేతికి బ్రేస్‌లెట్, చెవులకు అందమైన ఇయర్‌రింగ్స్ ధరించి, చిన్న బొట్టుతో తన లుక్‌ను మరింత ప్రత్యేకంగా మార్చుకుంది. జుట్టును అందంగా వెనక్కి వదిలి చిరునవ్వుతో కెమెరాకు ఫోజులు ఇచ్చింది. ముఖ్యంగా ఈ ఫోటోల్లో ఆషికా గ్లామర్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దీంతో ఈ పిక్స్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారగా, అభిమానులు ఆమె అందంపై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

# ప్రేక్షకుల దృక్కోణం మారింది

## అందుకే జాగ్రత్తలు తీసుకుంటున్నా: సాయిదుర్గా తేజ్



సాయి దుర్గా తేజ్ ప్రధానపాత్రలో తెరకెక్కుతోన్న చిత్రం 'సంబరాల ఏటిగట్టు'. రోహిత్.కె.పి దర్శకత్వంలో రానుంది. ఈ సినిమా విడుదల ఆలస్యం కావడంపై గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో రకరకాల చర్చలు నడుస్తున్నాయి. తాజాగా ఈ ఆలస్యంపై సాయి దుర్గా తేజ్ స్పందించారు. సినిమాల ఎంపికలో తాను ఎందుకు ఇంత సమయం అవసరమవుతోందో వివరించారు. ప్రస్తుతం ప్రేక్షకులు ఓటీటీల్లో ఎన్నో సినిమాలు, వెబ్‌సిరీస్‌లు వీక్షిస్తున్నట్లు తెలిపారు. అన్ని జానర్‌లలోని కంటెంట్ గురించి ఎన్నో విషయాలు నేర్చుకుంటున్నట్లు చెప్పారు. ప్రేక్షకుల ఆలోచనల్లో మార్పు వచ్చిందని అందుకే తన సినిమాల విషయంలో మరింత జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వాళ్లను మెప్పించాలంటే కథల ఎంపికలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించక తప్పదన్నారు. అందుకే కాస్త సమయం పడుతోందని స్పష్టం చేశారు. ఈ సినిమా కోసం తన సర్వస్వం ధారపోస్తూ... శాయశక్తులా శ్రమిస్తున్నట్లు గతంలో సాయి దుర్గా తేజ్ తెలిపారు. దర్శకుడు రోహిత్ విజన్ అందరికీ నచ్చేలా ఉంటుందన్నారు. మంచి బృందంతో కలిసి చేస్తున్న ఈ సినిమా తన కెరీర్‌లో ఒక అద్భుతంలా నిలిచిపోతుందని చెప్పారు.

# కాక్‌టెయిల్-2 భారీ వసూళ్లు



బాలీవుడ్‌లో మోస్ట్ అవేటెడ్ సీక్వెల్ మూవీగా థియేటర్లలోకి వచ్చింది 'కాక్‌టెయిల్ 2'. షాహిద్ కపూర్, రష్మిక మందన్న, కృతి సనన్ జంటగా హోమీ అదాజానియా దర్శకత్వంలో వచ్చిన కాక్‌టెయిల్ బాక్సాఫీస్ వద్ద అదిరిపోయే ఓపెనింగ్స్ రాబట్టింది. మొదటి వీకెండ్‌లోనే ఈ సినిమా ఇండియా వ్యాప్తంగా భారీ వసూళ్లతో దూసుకెళ్తోంది. మూడు రోజుల్లోనే మంచి హోల్డ్ సాధించి ట్రేడ్ వర్గాల్లో పాజిటివ్ వైబ్స్ క్రియేట్ చేసింది. ఈ సినిమా బాక్సాఫీస్ ప్రయాణాన్ని గమనిస్తే.. మొదటి రోజు నుంచే సాలిడ్ కలెక్షన్లు నమోదయ్యాయి. మొదటి రోజు రూ. 115.39 కోట్లు, రెండవ రోజు రూ. 19.25 కోట్లు, మూడవ రోజు ఆదివారం రూ. 20.22 కోట్లు రాబట్టి సూపర్ స్ట్రాంగ్ గా హోల్డ్ చేసింది. మొత్తంగా చూసుకుంటే మూడు రోజుల మొదటి వీకెండ్‌లో 'కాక్‌టెయిల్ 2' ఆల్ ఇండియా ట్రాక్డ్ గ్రాస్ కలెక్షన్స్ రూ. 54.86 కోట్లకు అటు ఇటుగా నమోదు చేసింది.

# కలెక్షన్లలో మా ఇంటి బంగారం దూకుడు

## పాజిటివ్ టాక్‌తో ప్రేక్షకుల ఆదరణ

స్టార్ హీరోయిన్ సమంత ప్రధాన పాత్రలో నటించిన 'మా ఇంటి బంగారం' బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన వసూళ్లతో దూసుకుపోతోంది. దాదాపు మూడు సంవత్సరాల విరామం తర్వాత సమంత నుంచి వచ్చిన ఈ చిత్రం ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ పొందుతూ విజయపథంలో కొనసాగుతోంది. మొదటి రోజు నుంచే పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకున్న ఈ మూవీ, వీకెండ్‌లో మరింత జోరు చూపించి భారీ కలెక్షన్లను నమోదు చేసింది. సాధారణంగా స్టార్ హీరోల సినిమాలకు కనిపించే స్థాయిలో 'మా ఇంటి బంగారం'కు ప్రేక్షకుల నుంచి స్పందన లభిస్తోంది. మొదటి రోజు మంచి ఓపెనింగ్స్ సాధించిన ఈ చిత్రం, శనివారం, ఆదివారం రోజుల్లో మరింత మెరుగైన వసూళ్లను రాబట్టింది. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం, కేవలం మూడు రోజుల్లోనే మా ఇంటి బంగారం సినిమా ఇండియా వైడ్ నెట్ కలెక్షన్లలో రూ.23.10 కోట్ల మార్కును దాటేసింది. ఈ మూడు రోజుల్లో సినిమా సాధించిన మొత్తం ఇండియా గ్రాస్ కలెక్షన్లు రూ.26.69 కోట్లకు చేరాయి.సమంతకు ఉన్న క్రేజ్ కారణంగా ఈ చిత్రానికి తెలుగు రాష్ట్రాల్లోభారీ స్పందన లభించింది. కేవలం తెలుగు వెర్షన్ నుంచే మూడో రోజు రూ.9.50 కోట్ల నెట్ కలెక్షన్లు రావడం విశేషం.కుటుంబ ప్రేక్షకులు, మహిళలు, యువత ఈ చిత్రానికి పెద్ద ఎత్తున థియేటర్లకు రావడంతో అనేక ప్రాంతాల్లో హౌస్‌ఫుల్ బోర్డులు కనిపించాయి.ముఖ్యంగా మౌత్ టాక్ సినిమాకు అతిపెద్ద బలంగా మారింది. సినిమా చూసిన ప్రేక్షకులు సోషల్ మీడియాలో తమ అభిప్రాయాలను పంచుకోవడం, కుటుంబంతో కలిసి చూడదగిన చిత్రంగా ప్రశంసించడం వల్ల వసూళ్లు రోజురోజుకూ పెరుగుతున్నాయి. తెలుగు చిత్ర పరిశ్రమలో లేడీ ఓరియెంటెడ్ సినిమాలకు భారీ ఓపెనింగ్స్ సాధించడం అరుదుగా కనిపిస్తుంది. అయితే 'మా ఇంటి బంగారం' ఆ రికార్డులను తిరగరాస్తూ, సమంత స్టార్‌డమ్‌కు మరోసారి నిదర్శనంగా నిలిచింది. సినిమాలో సమంత నటన, ఎమోషనల్ సన్నివేశాలు, యాక్షన్ ఎపిసోడ్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. చాలా కాలం తర్వాత ఆమె పూర్తి స్థాయి ప్రధాన పాత్రలో కనిపించడంతో అభిమానులు కూడా థియేటర్లకు భారీగా తరలివస్తున్నారు. ఈ చిత్రానికి దర్శకురాలు నందిని రెడ్డి తనదైన శైలిలో కుటుంబ భావోద్వేగాలు, హాస్యం, యాక్షన్ అంశాలను సమతుల్యంగా మిళితం చేశారు. ప్రేక్షకులను ఆకట్టుకునే కథనం, సహజమైన పాత్రల రూపకల్పన సినిమాకు ప్రధాన బలంగా నిలిచాయి.గుల్షన్ దేవయ్య, దిగంత్, గౌతమి, శ్రీముఖి తదితరులు తమ పాత్రల్లో మెప్పించగా, సమంతతో వారి సన్నివేశాలు సినిమాకు మరింత బలం చేకూర్చాయి. వీకెండ్‌లో అనేక ప్రాంతాల్లో థియేటర్లు హౌస్‌ఫుల్‌గా మారాయి. ముఖ్యంగా కుటుంబ ప్రేక్షకుల నుంచి వచ్చిన స్పందన సినిమాను సూపర్ హిట్ దిశగా నడిపిస్తోంది. పలు మల్టీప్లెక్స్‌లతో పాటు సింగిల్ స్క్రీన్ థియేటర్లలో కూడా మంచి ఆక్యుపెన్సీ నమోదవుతోంది.




PUBLISHED AND OWNED BY DUSARI KASTURI, PRINTER B SANDHYA RANI PRINTED AT M/S.KAKATIYA PRINTERS 2-24-96/9, NEAR SRI KRISHNA PHARMA, LAXMINARAYANA NAGAR, IDA UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500039, PUBLISHED AT H.NO. 9-875/104/3A, BAPUJI COLONY, NEAR VIJAYA HOSPITAL NAGARAM , MEDCHAL MALKAJ-GIRI, TELANGANA - 500083.,EDITOR : DUSARI RAVINDER GOUD, PRGI REGISTRATION NUMBER TGTEL/25/A1132, CELL :8522055889 MAIL ID:dusari kasturi9@gmail.com